

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు
అవగాహన కల్పించాలి: కలెక్టర్


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రీయ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. రానున్న మూడు నెలల్లో వ్యవసాయం స్థిర లక్ష్యాలను సాధించడానికి మండలాలు, డివిజన్లవారీగా నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. డ్రోన్ ట్రైనర్లతో మండలాలు, డివిజన్లవారీగా రైతులకు శిక్షణ ఇప్పించాలని ఆదేశించారు. జిల్లాలోని 32 మండలాల వ్యవసాయ నివేదికను వచ్చే సమావేశంలో సమర్పించాలన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మినీ గోకులం షెడ్ల ఎంపిక జాబితాను 15రోజుల్లో అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, మత్స్యశాఖాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, పశు సంవర్ధకశాఖ జేడీ శుభదాస్, జిల్లా సహకార శాఖాధికారి కృష్ణానాయక్ పాల్గొన్నారు.

21న మధ్యస్త ప్రాజెక్టులకు ఎన్నికలు

జిల్లాలోని మధ్యస్త ప్రాజెక్టులకు సంబంధించి సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఇరిగేషన్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలో మూడు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను ఎన్నుకుంటారన్నారు. వారి ద్వారానే అధ్యక్షఉపాధ్యక్షులను ఎన్నుకుంటారన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రాధాకృష్ణ, డీఈ గంగాద్రి, ఏఈ వినోద్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం

కలెక్టర్ టీఎస్ చేతన్.. పోలీసు స్పోర్ట్స్ మీట్ ప్రారంభం


క్రీడాజ్యోతిని అందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని కలెక్టర్ టీఎస్ చేతన్ అభిప్రాయపడ్డారు. పుట్టపర్తిలోని పోలీసు పరేడ్ మైదానంలో బుధవారం జిల్లా వార్షిక పోలీసు స్పోర్ట్స్ మీట్‌ను ఎస్పీ రత్నతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. క్రీడాజ్యోతిని వెలిగించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పోలీసు స్పోర్ట్స్ మీట్ పండుగ వాతావరణంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి పోటీలతో క్రీడాస్ఫూర్తి పెంపొందుతుందన్నారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ.. నిత్యం పని ఒత్తిడితో ఉండే పోలీసులకు క్రీడాపోటీలు మానసికోల్లాసాన్ని ఇస్తాయన్నారు. మూడురోజులపాటు ఎనిమిది క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ షార్ట్‌పుట్, డిస్క్‌త్రో విసిరి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీలు విజయ్‌కుమార్, కేవీ మహేష్, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.


డిస్క్‌త్రో చేస్తున్న ఎస్పీ రత్న



పంచకర్మ వైద్యం.. వ్యాధులు మాయం..

సంతేబిదనూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ప్రత్యేక వైద్యం

రెండు కాన్పులు నార్మల్‌గా అయ్యాయి

భ్రమరాంబ ఆయుర్వేద వైద్యశాలలో రెండు కాన్పులు నార్మల్‌గా జరిగాయి. నేను, పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నాం. గర్భం దాల్సిన సమయం నుంచి ఆయుర్వేద వైద్యశాలలో చికిత్స తీసుకున్నా. మంచి ఆహారంతోపాటు ఆయుర్వేద మందులు, వ్యాయామంతో నార్మల్ డెలివరీ అయింది. ఏ సమస్య వచ్చినా ఆయుర్వేద వైద్యశాలకు వస్తున్నా.

- భ్రమరాంబ

పెరుగుతున్న ఆదరణ
సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న జనం

ఆయుర్వేదం భారతదేశ ప్రత్యేకత. ప్రకృతిలో లభించే వనమూలికలు, చెట్ల నుంచి సేకరించిన వాటితో మందులు తయారుచేసి, వ్యాధి పీడితులకు అందించేవారు. ప్రపంచ దేశాల్లో వైద్యం అభివృద్ధి చెందని రోజుల్లోనే భారతదేశంలో ఆయుర్వేదం రాజవైద్యంగా పేరొందింది. నేటికీ ఆదరణ పొందుతోంది. ప్రభుత్వ ఆయుర్వేద చికిత్సాలయాలకు నేటికీ జనం పోటెత్తుతున్నారు. ఈ కోవలోకి చెందినదే హిందూపురం మండలంలోని సంతేబిదనూరులో గల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల.

- ఆంధ్రజ్యోతి, హిందూపురం అర్బన్


స్టీమ్ బాత్ వైద్యం పొందుతున్న మహిళ


ఓపీకి వచ్చిన జనం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే పంచకర్మ చికిత్స అందిస్తున్న ఏకైక కేంద్రం.. సంతేబిదనూరులోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల. ఇక్కడ పంచకర్మ వైద్యంతో ఎటువంటి అనారోగ్య సమస్యలైనా దూరమవుతున్నాయని చికిత్స తీసుకున్నవారు చెబుతున్నారు. ఇంగ్లీషు మందులకు లొంగని జబ్బులు కూడా పంచకర్మ వైద్యంతో నయమవుతున్నాయి. వమన, విరేచన, వస్తి, రక్తమోక్షణ, నస్యకర్మ అనే సూత్రాలపై ఆధారపడి పంచకర్మ వైద్యం చేస్తారు. ఈ విధానంలో దీర్ఘకాలిక రోగాలు సైతం నయమవుతున్నాయి. దీంతో సంతేబిదనూరు, చుట్టుపక్కల గ్రామల నుంచే కాక హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుత్తి, గుంతకల్లు, కర్నూలు, కర్ణాటక ప్రాంతాల నుంచి సైతం వ్యాధుల పీడితులు వచ్చి, చికిత్సలు పొందుతున్నారు. రోజూ 50 మంది వరకు ఓపీకి వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. పంచకర్మతో స్టీమ్ బాత్, మసాజ్‌లు చేయడమే కాకుండా ఉచితంగా మందులు కూడా అందిస్తున్నారు. యోగా శిక్షణ ఇచ్చి, వ్యాయామ చిట్కాలు చెబుతున్నారు.

నా కాలు తీసేయాలన్నారు



నా కాలికి గాయాలయ్యాయి. చాలా ఆస్పత్రుల్లో చూపించా. నయం కాకపోగా.. కాలు తీసేయాలన్నారు. చాలా భయమేసింది. ఆయుర్వేద వైద్యం నన్ను కాపాడింది. గాయాలు పూర్తిగా నయమయ్యాయి.

- గంగమ్మ, సంతేబిదనూరు

నడుంనొప్పి తగ్గింది: పార్వతమ్మ, హిందూపురం



తీవ్ర నడుంనొప్పి బాధిస్తుండేది. చాలా ఆస్పత్రులకు వెళ్లా. ఎముకలకు సంబంధించిన సమస్య అని నిపుణులు తెలిపారు. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. తెలిసిన వారు చెప్పడంతో ఆయుర్వేద ఆయుష్ మందర్‌కు వచ్చా. నాలుగు రోజులుగా చికిత్సలు పొందుతున్నా. నొప్పి తగ్గింది. దీంతో ఆయుర్వేద వైద్యంపై నమ్మకం ఏర్పడింది.

చనిపోవాలనుకున్నా..

నడవలేనంతగా విపరీతమైన కీళ్లనొప్పులతో బాధపడ్డా. అనంతపురం, హిందూపురం, కర్నూలు తదితర ప్రాంతాల్లో నరాలు, ఎముకల వైద్యులకు చూపించా. ప్రయోజనం దక్కలేదు. బాధను భరించలేక చనిపోవాలనుకున్నా. తెలిసినవారి సూచన మేరకు సంతేబిదనూరు ఆయుర్వేద వైద్యశాలకు వచ్చి, చికిత్స పొందుతున్నా. ప్రస్తుతం నడవగలుగుతున్నా.



- ఆదిలక్ష్మమ్మ, ఓబుళదేవర చెరువు

పంచకర్మ.. సర్వరోగ నివారిణి

పంచకర్మ వైద్యం సర్వరోగ నివారిణిగా పనిచేస్తుంది. ఆరోగ్య సమస్యలు ఉన్నవారే కాదు సంపూర్ణ ఆరోగ్యవంతులు కూడా ఈ వైద్యం పొందవచ్చు. రోగాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చు.



- అనురాధ, ఆయుర్వేద వైద్యురాలు

చిన్నారిని తీసుకెళ్తుండగా

వ్యక్తికి దేహశుద్ధి


పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి

కదిరి, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): తలుపుల మండల కేంద్రంలో బుధవారం ఏడేళ్ల బాలికను తీసుకెళ్తున్న వ్యక్తిని స్థానికులు పట్టుకుని, దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. తలుపులలోని ఓబీఆర్ కొత్తపల్లికి చెందిన బాలిక.. తల్లితో కలిసి బ్యాంకుకు వచ్చింది. తల్లి ముందు వెళ్తుండగా బాలిక వెనకాలే వెళ్తోంది. దీనిని గమనించిన కడప జిల్లా చక్రాయపేట మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన మతిస్థిమితం లేని ఓబులేసు బాలికను తీసుకెళ్లేందుకు యత్నించాడు. పూల బజారు సమీపంలో బాలిక గట్టిగా కేకలు వేసింది. దీంతో స్థానికులు.. అతడిని అడ్డుకుని, బాలికను రక్షించారు. అతడికి దేహశుద్ధి చేశారు. అతడిని పోలీసులకు అప్పగించారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం తల్లిదండ్రులను పిలిపించి, బాలికను అప్పగించారు.

ఉపాధ్యాయుడి

సస్పెన్షన్


షేక్ మహమ్మద్ సైపుల్లా

కొత్తచెరువు/పరిగి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పరిగిలోని ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మహమ్మద్ సైపుల్లాపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కిష్టప్ప బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయుడు సైపుల్లా ఆరు నెలల క్రితం స్టాక్ మార్కెట్ పేరుతో రూ.కోటిదాకా తమను నమ్మించి మోసం చేశాడంటూ అనంతపురానికి చెందిన వారు ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది సెప్టెంబరు 14న అనంతపురం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై విద్యాశాఖాధికారులు విచారణ చేపట్టారు. ఆరోపణలు వాస్తవమని తేలడంతో ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్నట్లు డీఈఓ వివరించారు.

బుక్కపట్నం ఎంఈఓపై విచారణకు ఆదేశం

బుక్కపట్నం మండల విద్యాధికారి (ఎంఈఓ) గోపాల్‌నాయక్ లైంగిక వేధింపుల ఆరోపణలపై కడప ఆర్జేడీ శామ్యూల్ విచారణకు ఆదేశించారు. ఈ విషయాన్ని డీఈఓ కిష్టప్ప బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు ఎంఈఓపై విచారణకు నిజనిర్ధారణ కమిటీని నియమించినట్లు డీఈఓ వెల్లడించారు.

రేపు జాబ్‌మేళా

కదిరి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 20న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత, డీసీబీ హరికృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 20న జాబ్‌మేళా ఉంటుందన్నారు. మూడు కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన 19 నుంచి 30 సంవత్సరాల లోపు వారు అర్హులన్నారు. ఆసక్తిగలవారు బయోడేటాతోపాటు ఆధార్, విద్యార్హతల పత్రాలతో 20న ఉదయం 9గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9390176421 నంబరులో సంప్రదించాలన్నారు.



ఫ్రీగా కట్టబెట్టారు..!

వైసీపీ నాయకుల అసైన్డ్ భూదందా
ఫ్రీహోల్డ్ మాటున స్వాహా
నిగ్గుతేల్చిన విచారణాధికారులు
ప్రభుత్వానికి నివేదిక

పుట్టపర్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా అసైన్డ్ భూములను కాజేశారన్నది బహిరంగా రహస్యమే. ఫ్రీహోల్డ్ (యాజమాన్య హక్కుల కల్పన) నిషిద్ధ జాబితా నుంచి భూములను తప్పించి, వాటిని సొంతం చేసుకున్నట్లు అధికారులు నిగ్గుతేల్చారు. అధికారం చేతిలో ఉందికదా అని ఫ్రీహోల్డ్ మాటున జిల్లాలో వందల కోట్ల రూపాయల విలువైన అసైన్డ్ భూదందా సాగింది. ఫ్రీహోల్డ్ మాటున జరిగిన అసైన్డ్ భూముల అవినీతి బాగోతంపై ఇటీవల అమరావతిలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ అధికారులు.. ముఖ్యమంత్రికి వివరించారు. జగన్ పాలనలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఫ్రీహోల్డ్ ముసుగులో నిషిద్ధ 22(ఏ) జాబితా నుంచి భూములను అక్రమంగా తప్పించడమే కాకుండా కొన్నింటికి రిజిస్ట్రేషన్లు సైతం చేసుకున్నారు. అసైన్డ్, చుక్కల, షరతుగల, అసైన్డ్ పట్టా, ఫ్రీహోల్డ్ భూములను దోచేసి, భూదందా సాగించారు. రెవెన్యూ అధికారులు, వైసీపీ నేతలు కుమ్మక్కై భూములు కాజేశారు. రాష్ట్రంలోనే ఫ్రీహోల్డ్‌లో జిల్లా మూడో స్థానంలో నిలిచింది. గత వైసీపీ పాలనలో ఫ్రీహోల్డ్ పేరుతో జరిగిన అక్రమాలపై ఉక్కుపాదం మోపేందుకు కూటమి సర్కారు చర్యలకు సిద్ధమైంది. క్షేత్రస్థాయిలో నాలుగు దశల్లో సమగ్ర విచారణ చేశారు. దీంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

ఫ్రీగా అప్పజెప్పారు...

గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు.. నిరుపేదల నుంచి అసైన్డ్ భూములను కొట్టేసేందుకు ఫ్రీహోల్డ్‌ను తీసుకొచ్చారన్న విమర్శలు బహిరంగా ఉన్నాయి. ఆ మేరకు 2003కు ముందు అసైన్డ్ భూములకు మాత్రమే ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాల్సి ఉంటుంది. నిబంధనలకు పాతరేసి, ఆ తర్వాత ఇచ్చిన వాటికీ చోటు కల్పించారు. జిల్లావ్యాప్తంగా జిల్లాలో 32 మండలాల్లో 2,57,042.47 ఎకరాలను పరిశీలించగా ఏకంగా 1,26,215 ఎకరాలు అడ్డగోలుగా కట్టబెట్టినట్లు అధికారులు విచారణలో తేల్చారు. ఆ మేరకు జిల్లా అధికార యంత్రాగం.. ప్రభుత్వానికి నివేదికలు పంపింది. ఫ్రీహోల్డ్ కల్పించిన భూముల్లో 5242.08 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేశారు. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా 2141.01 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసినట్లు లెక్క తేల్చారు. అధికారులు ఇచ్చిన ప్రొసీడింగ్స్ ఆధారంగానే రిజిస్ట్రేషన్లు చేస్తూ వచ్చారు. ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించే ప్రక్రియను ఈ ఏడాది జనవరి నుంచి ప్రారంభించారు. తామే అధికారంలోకి మళ్లీ వస్తామన్న దీమాతో వైసీపీ నేతలు.. అధికారులను అడ్డంపెట్టుకుని, అడ్డగోలుగా భూదందా సాగించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో అంతా తల్లకిందులైంది. అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించడం, అందులో వాస్తవాలని తేలడం, చర్యలకు ప్రభుత్వం సిద్ధమవుతుండడంతో భూరాబందుల్లో వణుకు మొదలైంది. ధర్మవరం, పెనుకొండ, చిలమత్తూరు, హిందూపురం, బుక్కపట్నం, చెన్నేకొత్తపల్లి, కదిరి, మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో అత్యధికంగా ఫ్రీహోల్డ్ చేసిన అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేశారు. ఇందులో అత్యధికంగా వైసీపీ నేతలతోపాటు ఆ పార్టీ అనుకూల స్థిరాస్తి వ్యాపారులు బినామీల పేరుతో ముందస్తు అగ్రిమెంట్లు, కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు నిగ్గుతేల్చారు. రాప్తాడు, పెనుకొండ నియోజక వర్గాల్లో పెద్ద ఎత్తున భూఅక్రమాలు జరిగినట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది.



టమోటాలో తెగులు నివారించుకోండి

ఉద్యాన శాఖాధికారి ప్రతాప్ రెడ్డి

నంబులపూలకుంట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): టమోటా పంటకు సోకిన తెగులును మందులు పిచికారీ చేసి, నివారించుకోవాలని కదిరి డివిజన్ ఉద్యానవన శాఖాధికారి ప్రతాప్ రెడ్డి సూచించారు. మండలంలోని మేకల చెరువు, ఎదురుదొన్న గ్రామాల పరిధిలో సాగుచేసిన టమాటా పంటను బుధవారం ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. సూక్ష్మపోషకాల లోపం ఉంటే ఫార్ములా 4ను 5గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వేస్టు డికంపోజర్ వాడటం ద్వారా పురుగు, తెగుళ్లతోపాటు నేల ఆరోగ్యం కాపాడుకోవచ్చన్నారు. ఆకుపచ్చ రోగ నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకు, కాయమచ్చ తెగులు నివారణకు సాప్ 2గ్రా. లీటరు నీటిలోగానీ, అమిస్టర్ గోల్డ్ 1.5 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కాయ పగుళ్లు ఏర్పడుతుంటే తగినంత నీటిని ఇస్తూ లీటరు నీటిలో బోరాన్ 2 గ్రా. కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం సమీపంలోనే మామిడి పంటను పరిశీలించి, పలు సూచనలు ఇచ్చారు. మొదటి పిచికారీలో భాగంగా 13.0.45 (పోటాషియం నైట్రేట్) 5గ్రా., లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఫార్ములా 4, 5గ్రా. లీటరు నీటికి, బోరాన్ 2గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే చెట్లు ఒకేసారి పూత వచ్చేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


మేకల చెరువులో టమోటా పంటను పరిశీలిస్తున్న అధికారులు

మంచి రోజులు వచ్చినట్లేనా..?



మైనర్ ఇరిగేషన్ కార్యాలయ నిర్మాణానికి ప్రతిపాదనలు
మూడు దఫాలు తిరస్కరించిన వైసీపీ ప్రభుత్వం
ప్రస్తుతం రూ.14.65కోట్లతో అంచనాలు పంపిన అధికారులు

వివరాలు 6

జగన్ బొమ్మ తీసేయండి

రీ సర్వే రాళ్లపై తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయం
కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఆదేశాలు

వివరాలు 6



రైతన్నకు దిగులే..!

రబీలో వేరుశనగకు తెగుళ్ల బెడద.. ఉధృతంగా ఆకుముడత, లద్దెపురుగు.. ఆందోళనలో అన్నదాతలు

6


వేరుశనగకు పంటకు తెగులు



నగరోత్సవంలో అయ్యప్పస్వామి

నేత్రపర్వంగా అయ్యప్ప నగరోత్సవం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కో దండ రామాలయం ఆవరణలోని హరిహరసుత అ య్యప్పస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం సా యంత్రంస్వామి నగరోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ఆవరణలో అయ్యప్పస్వా మికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన రథంలో వినాయకుడు, లక్ష్మీదేవి, అయ్యప్పస్వామి ఉత్సవమూర్తులను ఉంచి, పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు జ్యోతులతో ముందు సాగుతుండగా... అయ్యప్పదీక్షధారులు శరణుఘోష, గీతాలాప నలతో పాల్గొన్నారు. బాణసంచా పేలుళ్లు, చెక్కభజనలు, దేవతా వేషధారుల సందడితో ఉత్సవం సాగింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్ బాబు, గురుస్వాములు లక్ష్మిరెడ్డి, రంగాచారి, మణికంఠ బాబు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సోమర జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.



నగరోత్సవంలో పాల్గొన్న దీక్షధారులు

న్యూస్‌బాక్స్

21 నుంచి ఆంధ్రా-మహారాష్ట్ర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ కూచ్ బెహర్ అండర్-19 ట్రోఫీలో భాగంగా ఈ నెల 21వ తేదీ నుంచి ఆంధ్రా-మహారాష్ట్ర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆర్డీటీ స్టేడియంలో జరగనుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశామని జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగా రెడ్డి తెలిపారు. ఆంధ్రా జట్టుకు జిల్లా క్రీడాకారులు వీరారెడ్డి, జయంత్ కృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రెండు జట్ల క్రీడాకారులు గురువారం అనంత క్రీడా గ్రామానికి చేరుకుంటారు.

నేడు ఆటగాళ్ల పేర్ల నమోదు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 21 నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలకు పేర్లను నమోదు చేసుకోనున్నారు. ఈ నెల 19వ తేదీ గురువారం ఉదయం 10గంటల నుంచి అనంతపురం అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో ఆన్‌లైన్ పేర్ల నమోదు ప్రక్రియను నిర్వహిస్తామని డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ లక్ష్మి తెలిపారు. 18 సంవత్సరాలలోపు వయసు ఉండి, ఫెన్సింగ్‌లో ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, జననధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులు మాత్రమే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులని తెలిపారు.

21న ప్రాజెక్ట్ కమిటీల ఎన్నిక

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ప్రాజెక్టు ఎగువ కాలవ కమిటీ, భైరవాన్‌తిప్ప ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికల ప్రక్రియ ఈనెల 21న నిర్వహిస్తామని హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. నగరంలోని హెచ్చెల్సీ కాలనీ లోక్ డివిజన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక పూర్తి అయిందని అన్నారు. అసాధారణ సర్వసభ్య సమావేశం, చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు నామినేషన్ల స్వీకరణ, ఎన్నికలు, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన అదే రోజున ఉంటాయని తెలిపారు.

రైతన్నకు దిగులే..!

రబీలో వేరుశనగకు తెగుళ్ల బెడద
ఉధృతంగా ఆకుముడత, లద్దెపురుగు
ఆందోళనలో అన్నదాతలు



వేరుశనగ పంటకు సోకిన తెగుళ్ల

గుత్తిరూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన వేరుశనగ పంటను తెగుళ్ల వదలడం లేదు. లేత దశలో ఉన్న వేరుశనగ పైరును అప్పుడే తెగుళ్ల చుట్టేశాయి. పైరుకు ఆకుముడత తెగులుతో పాటు లద్దెపురుగు, మూతపురుగు ఆశించింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా బోరుబావుల కింద వెయ్యి ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. పంట సాగు చేసి 20నుంచి 25 రోజులు కావస్తోంది. మండలంలోని గొందిపల్లి, జక్కలచెరువు, గాజులపల్లి, తొండపాడు, టీ. కొత్తపల్లి, కొత్త పేట, వన్నేదొడ్డి, ఎంగిలిబండ, ఇసురాళ్లపల్లి, కరిడికొండ, రజాపురం, చేర్లోపల్లి, ఈశ్వరపల్లి, తదితర గ్రామాల్లో వేరుశనగ పంటను బోరుబావుల కింద సాగు చేశారు. చీడపీడల నుంచి పంటను కాపాడుకునేందుకు పలు రకాల మందులను పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతోంది. వాతావరణ మార్పులు, తుఫాను దెబ్బకి పంటకు తెగుళ్ల సోకుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పంటకు ట్రాక్టరుతో మందు పిచికారీ చేస్తున్నరైతు

లద్దెపురుగు విపరీతంగా ఆశించింది



నేను 10 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. 20 రోజుల పైరును లద్దెపురుగు ఆశించింది. నివారణకు పురుగుల మం దు పిచికారీ చేశా. వాతావరణ మార్పుల కారణంగా వేరుశనగ పంటకు తెగుళ్ల ఉధృతి అధికమైంది. వాటికి తోడు తు ఫాను ప్రభావంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

- రైతు శ్రీనివాస్ చౌదరి, ధర్మాపురం

ఆకుముడత తెగులు వ్యాపించింది



నేను రెండు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. ఆకుముడత తెగులు వ్యాపించింది. ఒక సారి మందు పిచికారీ చేసిన ఫలితం లేదు. పంట సాగు చేసి 20 రోజులు గడిచినా వాతావరణ మార్పుల వలన ఎదుగుదల కనబడటం లేదు. వాతావరణం అనుకూలిస్తేనే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

- గోవిందు రైతు బసినేపల్లి తండా



పంటను ఆశించిన లద్దెపురుగు

వాతావరణ మార్పులతోనే..

వేరుశనగ పంటకు ఆకుముడత తెగులు ఆశించి ఉంటే ఎకరానికి 500 ఎంఎల్ క్లోరోపైరిపాస్, 300 గ్రాములు అస్పేట్ పొడి మందును పిచికారీ చేయాలి. లద్దెపురుగు నివారణకు ఎకరానికి నూవాన్ ప్లేస్, అస్పేట్ 100 గ్రాములు చెప్పున స్ప్రే చేయాలి. పురుగు ఉధృతంగా ఉంటే వారం రోజుల వ్యవధిలో మరో సారి పిచికారీ చేయాలి. వాతావరణ మార్పుల కారణంగా పంటకు తెగుళ్ల సోకుతున్నాయి.

- ముస్తాక్ అహమ్మద్, వ్యవసాయాధికారి, గుత్తి

జగన్ బొమ్మ తీసేయండి

రీ సర్వే రాళ్లపై తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయం
కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఆదేశాలు

అనంతపురం టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో భూ సర్వే పేరుతో జగన్ బొమ్మతో ముద్రించిన రాళ్లను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రీసర్వేను ఆపేయడంతోపాటు అపుడు జరిగిన అవకతవకలను సరిదిద్దడానికి రెవెన్యూసదస్సులు నిర్వహిస్తోంది. ఇటీవల అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో సర్వే రాళ్లపై ఉన్న జగన్ బొమ్మలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు.

అనంతలో 2,60,690 రాళ్లకు జగన్‌బొమ్మలు

వైఎస్ఆర్ జగనన్న భూరక్ష పథకాన్ని 2020లో అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చింది. అందులో భాగంగా జిల్లాలో తొలి విడతగా 198గ్రామాలలో 5,88,615ఎకరాలలో రీసర్వే చేపట్టారు. ఈగ్రామాలలో రీసర్వే అనంతరం హద్దులలో జగన్‌బొమ్మతో కూడిన 2,60,690 రాళ్లను నాటారు. ఈరాళ్లకు ఉన్న జగన్ పేర్లను తొలగించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇంకో వైపు ఆసమయంలో రైతులకు జారీ చేసిన జగన్‌బొమ్మతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను రద్దుచేసి, ప్రభుత్వం ముద్రతో రూపొందించిన పుస్తకాలను అందజేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల జరిగిన కలెక్టర్లు సదస్సులో ముఖ్యమంత్రి ఇదేవిషయంపై ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈమేరకు వాటిన అమలు చేయడానికి జిల్లా యంత్రాంగం సిద్ధమైంది.



జగన్ బొమ్మలతో సరఫరా చేసిన రీసర్వే రాళ్లు (ఫైల్)

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

రీసర్వే విషయంలో రాష్ట్రప్రభుత్వ ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటున్నాం, ఇప్పటికే సీఎం ఆదేశాలు ఇచ్చిన విషయం వాస్తవమే. జిల్లా కలెక్టరు, జేసీలు దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటారు. దాని ప్రకారం రాళ్లపై ఉన్న జగన్ బొమ్మలు, పేర్లను తొలగించడానికి చర్యలు తీసుకుంటాం.

-రూప్లానాయక్, ఏడీ, సర్వేశాఖ

మంచి రోజులు వచ్చినట్లేనా..?

మైనర్ ఇరిగేషన్ కార్యాలయ నిర్మాణానికి ప్రతిపాదనలు
మూడు దఫాలు తిరస్కరించిన వైసీపీ ప్రభుత్వం
ప్రస్తుతం రూ.14.65కోట్లతో అంచనాలు పంపిన అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మారిన పరిస్థితుల నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన మైనర్ ఇరిగేషన్ కార్యాలయ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈ, జలవనరుల శాఖ ప్రాజెక్ట్ సీఈలు కలిపి రూ.14.65కోట్లతో ప్రతి పాదనలు పంపారు. కార్యాలయ నిర్మాణానికి అవసరమైన నిధులను ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా అందజేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

స్థలం కాజేసేందుకు వైసీపీ విఫలయత్నం

నగర నడిబొడ్డున రూ.కోట్ల విలువ చేసే సుమారు మూడెకరాల స్థలంపై గతంలో వైసీపీ పాలకులు కన్నేశారు. దాన్ని సొంతం చేసుకోవడానికి విఫలయత్నం చేశారు. ఈక్రమంలోనే రెండున్నరేళ్ల కిందట కురిసిన భారీ వర్షానికి శిథిలావస్థలో ఉన్న మైనర్ ఇరిగేషన్ కార్యాలయ భవనం కుప్పకూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. అయితే కార్యాలయం మరమ్మతులు, నూతన భవనం నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం యత్నించలేదు. పైగా ఆ స్థలాన్ని కాజేసేందుకు ఆ పార్టీ నేతలు యత్నించారు. వైసీపీ జిల్లా కార్యాలయం నిర్మాణానికి మొదట ఆ పార్టీ పెద్దలు ఈ స్థలంపై కన్నేయగా అది విఫలం కావడంతో హెచ్చెల్సీ కాలనీలోని స్థలాన్ని ఎంపిక చేసుకున్నారు. నూతన కార్యాలయ నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వంలో జలవనరుల శాఖ, మైనర్ ఇరిగేషన్ అధికారులు మూడు దఫాలుగా ప్రతిపాదనలు పంపినా తిరస్కరణకు గురైంది. అయితే కూటమి ప్రభుత్వం కార్యాలయ ని ర్మాణానికి అంచనాలు పంపమని అధికారులను అడగ డంతో ఆశాఖ ఉద్యోగుల్లో ఆనందం వెల్లువిరుస్తోంది.




కూలిన మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయం (ఫైల్)

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

శిథిలావస్థకు చేరిన కార్యాలయం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పగలు పిచ్చాపాటిగా మాట్లాడుకునేందుకు, వాహనాల పార్కింగ్‌కు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు అడ్డాగా మారింది. చీకటిపడితే మం దుబాబులు అక్కడికి మద్యం తెచ్చుకుని సేవిస్తున్నారు. ఉదయం కార్యాలయానికి వచ్చే ఉద్యోగులకు ఖాళీ మద్యం సీసాలు, సిగరెట్ పీకలు కనిపిస్తున్నాయి. సరైన భద్రత లేకపోవడంతో ఉద్యోగులు భయం గుప్పిట్లో విధులు నిర్వహిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ప్రభుత్వ ఆదేశాలతోనే మైనర్ ఇరిగేషన్ కార్యాలయ నిర్మాణానికి ప్రతి పాదనలు పంపాం. రూ.14.65కోట్లతో జలవనరుల శాఖ ప్రాజెక్ట్ సీఈ ద్వారా ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశాం. గతంలో కూడా ప్రతిపాదనలు పంపినా తిరస్కరించారు. ప్రధాన కార్యాలయం భవనం పైభాగం కుప్ప కూలింది. అయితే ఆ సమయంలో ఎవరూ కార్యాలయంలో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కార్యాలయంలోకి బయటవారిని రాకుండా చూసుకుంటున్నాం. కార్యాలయం పనివేళల తరువాత, సెలవు దినాలలో గేటుకు తాళం వేయాలని సూచించాం.



- విశ్వనాథ్‌రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ



మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో బయట వ్యక్తుల వాహనాలు పార్కింగ్



కూలేందుకు సిద్ధంగా ఉన్నపైకప్పు

ఎన్ని కష్టాలో..!

బర్త్ సర్టిఫికెట్ల కోసం తల్లిదండ్రుల అగచాట్లు

శెట్టూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అపార్ జనరేషన్‌కు అవసరమైన బర్త్ సర్టిఫికెట్ల కోసం తల్లిదండ్రులు నానా ఇబ్బందులు పడుతున్నారు. బర్త్ సరిఫికెట్‌కు అవసరమైన పత్రాల కోసం మీ సేవ, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. నోటరీ కోసం, మీసేవ కేంద్రంలో నమోదు కోసం వందలాది రూపాయలు ఖర్చు అవుతున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. పనులు వదులుకుని మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రానికి రావడానికి చాలా డబ్బులు ఖర్చు అవుతున్నాయని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి అపార్ ప్రక్రియను సరళీకృతం చేయాలని కోరుతున్నారు.

రూ.ఐదు వేలు ఖర్చయ్యాయి



జనన ధ్రువీకరణ పత్రం మంజూరు కోసం రూ. ఐదు వేలు ఖర్చయ్యింది. అయినా ఇప్పటికీ పూర్తి కాలేదు. కార్యాలయాల చుట్టూ తిరిగి కాళ్లరిగిపోయాయి. ప్రభుత్వం స్పందిం చి అపార్ వ్యవహారాన్ని సులభతరం చేయాలి.

- చిరంజీవి, పర్లచేడు గ్రామం

ఓపిక నశిస్తోంది



ఇప్పటికే జనన ధ్రువీకరణ పత్రం కోసం, నోటరీ కోసం లాయర్ వద్దకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం, మీ సేవ ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగడానికి రూ. నాలుగు వేలు ఖర్చయ్యింది. ఇన్ని కార్యాలయాల చుట్టూ తిరగడానికి ఓపిక నశిస్తోంది. అవసరం కాబట్టి తిరుగుతున్నాం.

- మంజునాథ, పర్లచేడు



సీసీ రోడ్డు వేయకముందు పరిస్థితి

మారుతున్న రూపురేఖలు

ఉరవకొండ, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరు గ్రామంలోని ప్రధాన రోడ్డు అభివృద్ధి ఎట్టకేలకు ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వం ఉపాధి పథకం కింద రూ.12లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టింది. గతంలో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు, వర్షపు నీరు రోడ్డుపైనే నిలబడి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగేది. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో వాహనదారుల అదుపు తప్పి కింద పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వా టీడీపీ నాయకులు చొరవ తీసుకుని సీసీరోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజీ పనులు చేపట్టారు. రోడ్డు నిర్మాణం పనులు పూర్తి కాగా డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయి. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన టీడీపీ నాయకులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



సీసీ రోడ్డు వేసిన తర్వాత..

రోజూ కందులు కొనాలి

నేటి నుంచే రైతుల పేర్లు నమోదు చేసుకోండి
ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ

అనంతపురం టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పండించిన కందులను ప్రతిరోజు మార్కెట్ ధరకు కొనుగోలు చేయాలని అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ, మార్కెఫెడ్, తదితరశాఖల అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ కందుల కొనుగోలు విషయంలో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా, అందరిని సమన్వ యం చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో గురువారం నుంచే రైతుల పేర్లు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ, డీసీఓ, డీసీఎంఎస్‌లకు కేటాయించిన కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా కందులు కొనేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గోడౌన్‌లు, కొనుగోలు కేంద్రాలవద్ద కార్యకలాపాలు సజావుగా జరిగేలా మార్కెఫెడ్ అధికారులు చూడాలన్నారు. కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు, కొనుగోలు చేసిన కందులను గోడౌన్‌లకు రవాణా చేయడానికి, భద్రపరచడానికి సర్వం సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమలో అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, మార్కెఫెడ్ మేనేజర్ పెన్నేశ్వరి, మార్కెటింగ్ అధికారి సత్యనారాయణచౌదరి, జిల్లా సహకారఅధికారి అరుణకుమారి, డీసీఓ వెంకటేశ్వర్లుతో పాటు పలువురు పాల్గొన్నారు.

జీఆర్పీకి ఏబీసీడీ
సాంకేతిక అవార్డు



డీజీపీ నుంచి అవార్డును అందుకుంటున్న గుంతకల్లు జీఆర్పీ ఎస్పీ

గుంతకల్లు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే పోలీసులకు అబౌ అండ్ బియోండ్ ద కాల్ ఆఫ్ డ్యూటీ (ఏబీసీడీ) అవార్డు దక్కింది. విజయవాడలో బుధవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో డీజీపీ ద్వారకా తిరుమల రావు చేతుల మీదుగా రైల్వే ఎస్పీ రాహుల్ మీనా, ఆయన టీం సభ్యులు ఏబీసీడీ అవార్డును అందుకున్నారు. విధి నిర్వహణలో సాంకేతికత వినియోగం, కేసుల పరిష్కారంలో సాధించిన ఫలితాలకు ఈ అవార్డులను ప్రకటించారు. ఈ సంవత్సరం రాష్ట్ర స్థాయిలో గుంతకల్లు రైల్వే డివిజన్ రెండో స్థానంలో నిలిచింది. గత సంవత్సరం మూడో స్థానంలో నిలిచింది. గుంతకల్లు డివిజన్ వరుసగా రెండుసార్లు అవార్డును సాధించడం విశేషం. సమష్టి కృషితో గుంతకల్లు రైల్వే పోలీసు జిల్లా విభాగం అవార్డును దక్కించుకుందని ఎస్పీ రాహుల్ మీనా అన్నారు.

వేతన ఖాతా ప్రయోజనాలపై అవగాహన

అనంతపురం క్రైం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హోంగార్డుల వినతి మేరకు వారి శాలరీ ప్యాకేజీపై (వేతన ఖాతా ప్రయోజనాలు) అధికారులు అవగాహన సదస్సును నిర్వహించారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు బుధవారం నిర్వహించిన సదస్సులో పాల్గొన్నారు. హోంగార్డ్స్ దర్బార్‌లో ఈ నెల 6న ఎస్పీ జగదీష్‌కు హోంగార్డులు తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. తమ బ్యాంకులోని శాలరీ అకౌంట్ ద్వారా ఎలాంటి ప్రయోజనాలు పొందవచ్చో బ్యాంకు అధికారులు వివరించారు.

● అనంతపురం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని సెంట్రల్ పోలీస్ క్యాంటిన్ విస్తరణ పనులకు పోలీసు అధికారులు బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఎస్పీ జగదీష్ ఆదేశాలతో అదనపు ఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్ బాషా సీపీసీ భవనం పక్కనే విస్తరణ పనులను ప్రారంభించారు. కార్యక్రమాలలో ఆర్ఐలు రాముడు, మధు, ఆర్ఎస్ఐ మగ్బూల్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం నాయకులు త్రిలోక్‌నాథ్, సూర్యకుమార్, హరినాథ్, తేజ్‌పాల్, ఆనంద్, లక్ష్మీనారాయణ, ఎస్పీ సీసీ అంజనేయప్రసాద్, ఎస్బీఐ అధికారులు వేణుగోపాల్, రాఫెల్ రాజు, నవీన్ మురహరి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఏఎస్పీ

క్రైం కార్నర్
CRIME CORNER

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి


వృద్ధురాలి మృతదేహం

తాడిపత్రి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని టెక్ కళాశాల వద్ద బుధవారం రాత్రి లారీ ఢీకొనడంతో లక్ష్మీదేవి (66) అనే వృద్ధురాలు మృతిచెందారు. లక్ష్మీదేవి టెక్ కళాశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. పనినిమిత్తం బయటకు వచ్చిన ఆమె.. రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

పామిడి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సొరకాయలపేట గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. సొరకాయలపేట ఆంజనేయులుకు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఇటీవల ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా అవకాశం కల్పించారు. పనులు చేయకపోయినా మస్టర్‌లలో పేర్లు నమోదు చేయాలని కొందరు అతనిపై ఒత్తిడి చేశారు. అలా చేస్తే సోషల్ ఆడిట్‌లో తనకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆంజనేయులు అంగీకరించలేదు. దీంతో అతన్ని తొలగించాలని కొందరు నాయకులు పట్టుబట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు కోసం రూ.లక్షకు పైగానే ఖర్చు చేశామని, తొలగిస్తే నష్టపోతానని, అవమానంగా ఉందని తన ఇంట్లోనే మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే పామిడి ఆసుపత్రికి తరలించారు. ఆ తరువాత మెరుగైన చికిత్సకు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఆంజనేయులు పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని బాధితుని భార్య సుభద్ర అధికారలకు విన్నవించారు.

చీరల దొంగ అరెస్టు

అనంతపురం క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ఇంట్లో చొరబడి, చీరలు దొంగలించిన కేసులో నిందితుడిని త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. హెచ్చెల్సీ కాలనీకి చెందిన గుగ్గిళ్ల అనిల్‌కుమార్ సోషల్ సర్వీస్ పేరుతో ప్రజలకు చీరలు, గ్యాస్ స్టవ్స్, పుస్తకాలు పంచుతుంటారు. తన ఇంట్లోని ఔట్‌హౌస్‌లో వాటిని నిల్వ చేశారు. దొంగ చొరబడి మంగళవారం రాత్రి రూ.25వేల విలువైన చీరలను ఎత్తుకుపోయాడు. దీంతో అనిల్‌కుమార్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మొదటి రోడ్డు రైల్వేస్టేషన్ వద్ద ఉన్న నిందితుడు, కూడేరు మండలం కరుట్లపల్లికి చెందిన వజ్రగిరి సాయిప్రసాద్‌ను అరెస్టు చేశామని త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు.

భర్తకు ఏడాది జైలు శిక్ష

భార్యను వేధించిన కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష పడింది. నగరంలోని ఎర్రనేల కొట్టాలకు చెందిన శైలజకు అదే కాలనీకి చెందిన బత్తల సురేంద్రబాబుతో 2009 నవంబరు 27న వివాహమైంది. ఆ సమయంలో సురేంద్రబాబుకు 8తులాల బంగారాన్ని కట్నంగా ఇచ్చారు. ఆ తరువాత రూ.1.50 లక్షలు అదనపు కట్నం తీసుకుని రావాలని సురేంద్రభార్యను వేధించాడు. దీంతో బాధితురాలు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ నాగమధు కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. సాక్షులను విచారించి చార్జ్‌షీట్ వేశారు. ఈ కేసులో మొబైల్ కోర్టు జడ్జి సుజన్ సాక్షులను విచారించి, బత్తల సురేంద్రబాబుకు ఏడాది జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు.

మెసేజ్ పంపి.. రూ.2 లక్షలు కాజేశారు..!

డి.హీరేహాళ్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఫోన్ మెసేజ్ పంపి.. ఒక వ్యక్తి నుంచి రూ.2 లక్షలు కాజేశారు సైబర్ నేరగాళ్లు. ప్రముఖ కాంట్రాక్టర్ గొడిశలపల్లి హనుమంతరెడ్డి ఖాతా నుంచి రెండు రోజుల క్రితం ఈ సొమ్మును మాయం చేశారు. తన ఖాతాలో డబ్బులు జమ అయినట్లు టెక్స్ మెసేజ్ వచ్చిందని, ఆ డబ్బులు జమ అయ్యాయో లేదోనని చెక్ చేసుకునేందుకు టెక్స్ మెసేజ్‌పై నొక్కానని హనుమంతరెడ్డి తెలిపారు. ఆ వెంటనే తన ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారని, తన ఖాతా నుండి రూ.41 వేలు బదిలీ అయినట్లు మెసేజ్ వచ్చిందని తెలిపారు. కంగారు పడి తిరిగి పరిశీలించే లోపు రూ.1.4 లక్షలు, ఆ తరువాత రూ.20 వేలు తన ఖాతా నుంచి బదిలీ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయని తెలిపారు. వెంటనే బ్యాంకుకు వెళ్లి తన ఖాతాను తాత్కాలికంగా నిలిపివేయించానని తెలిపారు. తన ఖాతాలో మిగిలిన రూ.7 లక్షలను కూడా సైబర్ నేరగాళ్లు కాజేసేందుకు ప్రయత్నించారని, బ్యాంక్ మేనేజర్ వెంటనే ఆ ఖాతాను బ్లాక్ చేశారని తెలిపారు. రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు.

టీడీపీ మండల కన్వీనర్‌పై వైసీపీ వర్గీయుల దాడి

హిందూపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ చిలమత్తూరు మండల కన్వీనర్ రంగారెడ్డిపై వైసీపీకి చెందిన వారు బుధవారం దాడి చేశారు. హిందూపురం రూరల్ సీఐ జనార్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి స్వగ్రామమైన చిలమత్తూరు మండలంలోని పెద్దన్నపల్లిలో ఇంటి ముందు ఉండగా, వీధిలో అటుగా వెళ్తున్న వైసీపీకి చెందినవారు కవ్వింపు చర్యకు పాల్పడ్డారు. దీంతో వారి మధ్య మాటామాటా పెరిగింది. వైసీపీకి చెందిన వెంకటరాముడు, మరో ముగ్గురు కలిసి రంగారెడ్డిపై దాడి చేశారు. దీంతో రంగారెడ్డి నుదిటిపై రక్తగాయమైంది. వెంటనే ఆయన హిందూపురం ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వైసీపీకి చెందిన వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వెంకటరాముడు, మరి కొంతమంది చిలమత్తూరు పోలీసు స్టేషన్‌లో ఉండగా.. పలువురు అక్కడికి వెళ్లి వారిపై దాడికి యత్నించారు. పోలీసులు.. వారిని అడ్డుకుని, అక్కడి నుంచి పంపించేశారు.

వైసీపీ నాయకుడిపై దాడి

తాడిపత్రి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు కాశీ మనోజ్‌ను కిడ్నాప్‌చేసి, దాడి చేశారని పట్టణ ఎస్‌ఐ గౌస్‌బాషా తెలిపారు. కాశీ మనోజ్ వైసీపీలో చురుగ్గా ఉండేవారు. దీన్ని మనసులో పెట్టుకొని జూటూరు రవితోపాటు మరికొంతమంది బుధవారం అతన్ని కిడ్నాప్ చేసి దాడిచేశారని కాశీ మనోజ్ చిన్నాన్న కాశీ విజయ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు, తన స్నేహితుడు అనిల్ పెళ్లికి బుధవారం వచ్చి, సంధ్య థియేటర్ వద్ద కాఫీ తాగుతుండగా రవితోపాటు మరికొందరు వాహనంలో వచ్చి కిడ్నాప్ చేశారు. రావివెంకటాంపల్లి వద్దకు తీసుకువెళ్లి దాడి చేసి, వదిలిపెట్టి వెళ్లారు. బాధితుడు బంధువులకు సమాచారం అందించడంతో వారు వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ దాడిపై కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాశీమనోజ్‌ను వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి పేరం స్వర్ణలత, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, వేమనాథ్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కాశీమనోజ్ నార్పలలో ఉంటున్నారు.

రక్షకులు ఏరీ..?



పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత.. ఎస్‌ఐ పోస్టు ఖాళీ.. సీఐపై పనిభారం

1.5 లక్షల జనాభాకు 15మంది పోలీసులు

సిబ్బంది నియామకాన్ని పట్టించుకోని ఉన్నతాధికారులు



తాడిపత్రి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అత్యంత సమస్యాత్మక ప్రాంతం తాడిపత్రిని పోలీసు సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో నేరాలను అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారు. చివరికి ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకోవడానికి కూడా తగిన సిబ్బంది ఉండటం లేదు. ఈ ప్రాంతంలో రాజకీయ సంఘర్షణ వాతావరణం నెలకొని ఉండటంతో ఇక్కడికి రావడానికి పోలీసు అధికారులు జంకుతున్నారు. వచ్చిన అధికారులు నెల, రెండునెలలు పనిచేయడం కూడా గగనమైంది. తరచూ పోలీసు అధికారులు మారుతుండటంతో నేరాల నియంత్రణ సక్రమంగా జరగటం లేదు. పట్టణంలో ఇటీవల పెరిగిన దొంగతనాలే ఇందుకు నిదర్శనం.

ఏడాదిన్నరలో ఆరుగురు సీఐలు

ఏడాదిన్నర వ్యవధిలోనే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో దాదాపు ఆరుగురు సీఐలు మారారు. ఏడాది న్నర కిందట సీఐగా ఆనందరావు దాదాపు 10నెలలు విధులు నిర్వహించాడు. ఆయన ఆత్మహత్య చేసుకోవడంతో ఆ స్థానంలో హమీద్‌ఖాన్ బాధ్యతలు చేపట్టారు. వివిధ ఆరోపణలతో ఐదు నెలలకే అతడిని ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు. తర్వాత ఈ స్థానంలో పనిచేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ట్రైనీ డీఎస్పీగా ఉన్న హేమంత్‌కుమార్ రెండు నెలలపాటు సీఐ విధులు కూడా నిర్వహించారు. అనంతరం సీఐగా వచ్చిన మురళీకృష్ణను ఎన్నికల అనంతరం జరిగిన పరిణామాలకు బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేశారు. తర్వాత రోజుల వ్యవధిలోనే నాగేంద్రప్రసాద్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. కానీ ఈయన కూడా ఒత్తిళ్లు భరించలేక దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. దీంతో సీఐగా ఇస్మాయిల్ బాధ్యతలు స్వీకరించారు. అయితే పదిరోజులకే నాగేంద్రప్రసాద్ తిరిగి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ధర్మవరానికి బదిలీపై వెళ్లడంతో ప్రస్తుతం సీఐగా సాయిప్రసాద్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కానీ ఎస్‌ఐ స్థాయి అధికారి ఒకరు కూడా లేకపోవడంతో సీఐపై పనిభారం పెరిగింది.

సెక్షన్ డ్యూటీ ఎత్తివేత

ఎన్నికల ముందు సెక్షన్ డ్యూటీలుగా నియమించేవారు. ఏ, బీ,సీలుగా విభజించి డ్యూటీలు వేసేవారు. సిబ్బంది కొరత వల్ల సెక్షన్ డ్యూటీలను పూర్తిగా తీసివేశారు. పోలీసులకు గతంలో నాలుగు బీట్‌లు వేసేవారు. ప్రస్తుతం స్పెషల్‌పార్టీ, ఇతర పోలీస్ స్టేషన్‌ల నుంచి సిబ్బందిని రప్పించి రెండు బీట్‌లు వేస్తున్నట్లు సమాచారం. మండలంతోపాటు పట్టణంలో రెండు బీట్లే ఉండటంతో దొంగతనాలు ఎక్కువయ్యాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అధికారుల శీతకన్ను

పట్టణ పోలీస్‌స్టేషన్‌పై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు శీతకన్ను వేసినట్లు అగుపిస్తోంది. గతేడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ముగ్గురు ఎస్‌ఐలు విధులు నిర్వహించారు. అప్పట్లో ఎలాంటి దొంగతనాలు, రాజకీయ దాడులు ఇతర సమస్యలు ఏర్పడలేదు. ప్రస్తుతం సీఐతోపాటు ఏఎస్‌ఐలు ముగ్గురు, హెడ్‌కానిస్టేబుళ్లు ఆరుగురు, కానిస్టేబుళ్లు 15మంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ సంఖ్య పట్టన జనాభాకు ఏమాత్రం సరిపోదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఎస్‌ఐ పోస్టు ఖాళీ

దాదాపు ఐదునెలల నుంచి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ పోస్టు ఖాళీగా ఉంది. ఈ స్థానం భర్తీ చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. 1956 నిబంధనలను అనుసరించి పట్టణ జనాభా ప్రకారం పోలీస్‌స్టేషన్‌కు ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, నలుగురు ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు 10మంది, కానిస్టేబుళ్లు 42మంది ఉండాలి. పట్టణ జనాభా ప్రస్తుతం 1.5లక్షలు దాటింది. పాత నిబంధనల ప్రకారం కూడా ఇక్కడ పోలీసు సిబ్బంది లేరు. ఎస్‌ఐ స్థాయి అధికారి లేకపోవడంతో వివిధ సమస్యలపై స్టేషన్‌కు వచ్చే ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక వెనుదిరిగి పోతున్నారు. ప్రస్తుతం ఒక సీఐ, ఏఎస్‌ఐలు ముగ్గురు, హెడ్‌కానిస్టేబుళ్లు 8మంది ఉన్నారు. కానిస్టేబుళ్లు 21మంది ఉండగా ఇందులో ముగ్గురు పది రోజుల కిందట వీఆర్‌పై వెళ్లారు. ముగ్గురు డెప్యుటేషన్‌పై వెళ్లారు. మిగిలిన 15మందిలో ఇద్దరు కంప్యూటర్, ఇద్దరు కోర్టుకు, ఇద్దరు సెంట్రీ, ఇద్దరు రిసెప్షన్‌లో ఉంటారు. మిగిలిన ఏడుగురు మాత్రమే పట్టణంలో తిరగాల్సి ఉంటుంది.


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


వాలీబాల్ పోటీల్లో హోరాహోరీగా తలపడుతున్న విద్యార్థులు

క్రీడాస్ఫూర్తి నింపడమే ధ్యేయం

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- హోరాహోరీగా పాలిటెక్నిక్ విద్యార్థుల క్రీడాపోటీలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. బుధవారం అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ (ఐపీఎస్‌జీఎం-2024)ను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగే పోటీలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. క్రీడా జ్యోతిని వెలిగించి శాంతి కపోతాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాలలో బాలు ర వసతి గృహ నిర్మాణానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ ప్రవేశపెట్టేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన వాలీబాల్‌తో పోటీలను ప్రారంభించారు. శుక్రవారం ముగింపు కార్యక్రమంలో విజేతలకు కప్‌లను అందజేస్తామని ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. విజయం సాధించిన జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ జడ్పీటీసీ సభ్యుడు సాకే చంద్ర, టీడీపీ నాయకులు జయరాంనాయుడు, అధ్యాపకులు రామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, శేఖర్, రాంబాబు, బాలుచంద్రానాయక్, రఘురామరెడ్డి, నిత్యలావణ్య, అనిత, సుధారాణి, రాధిక పాల్గొన్నారు.

రసవత్తరంగా పోటీలు

అనంతపురం ఉమ్మడి జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. హైజంప్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, డిస్కస్, జావెలిన్‌త్రో, షాట్‌పుట్‌తో పాటు 100, 200, 400, 800 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. చెస్, వాలీబాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. అనంతపురం, హిందూపురం, తాడిపత్రి, ధర్మవరం, గుంతకల్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలతోపాటు అనంతలక్ష్మి, పీవీకేకే, గేట్స్, టెక్ ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు పోటీపడ్డారు. విద్యార్థుల ఈలలు, కేరింతల నడుమ పోటీలు రసవత్తరంగా సాగాయి. వీటిలో బాలుర విభాగం చెస్ పోటీల్లో అనంతపురం ప్రభుత్వ కళాశాల విద్యార్థి అఫ్జల్, తాడిపత్రి సీవీఆర్‌ఐటీ అఖిలేష్‌రెడ్డి, పీవీకేకే సోమేష్‌కుమార్ విజయాన్ని సాధించారు. టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో విద్యార్థులు అనంతపురం ప్రభుత్వ కళాశాల విద్యార్థులు కిరణ్, ఉదయ్ విన్నర్స్‌గా నిలిచారు. ఉరవకొండ ప్రభుత్వ కళాశాల వెంకటప్రసాద్, ఆజమ్‌ఖానా రన్నర్స్‌గా మిగిలారు. టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ఉరవకొండ ప్రభుత్వ కళాశాల విద్యార్థి వెంకటప్రసాద్, అనంతపురం ప్రభుత్వ కళాశాల కిరణ్ విజయాన్ని సాధించారు.


అనంతలక్ష్మి, ధర్మవరం కళాశాల విద్యార్థుల మధ్య ఖోఖో


చెస్ పోటీల్లో ఎత్తుకు పైఎత్తువేస్తున్న విద్యార్థులు


పోటాపోటీగా పరుగు పందెం

క్రీడ పేరు	విద్యార్థి	కళాశాల
చెస్	సుమశ్రీ అమృత వైష్ణవి	ధర్మవరం ప్రభుత్వ కళాశాల అనంతపురం ప్రభుత్వ కళాశాల హిందూపురం ప్రభుత్వ కళాశాల
టేబుల్ టెన్నిస్(డబుల్)	అప్రిత, అమృత కుసుమ, మేఘన	అనంతపురం ప్రభుత్వ కళాశాల(విన్నర్స్) పీవీకేకే కళాశాల(రన్నర్స్)
టేబుల్ టెన్నిస్(సింగిల్)	అప్రిత మీనాక్షి	అనంతపురం ప్రభుత్వ కళాశాల(విన్నర్స్) హిందూపురం ప్రభుత్వ కళాశాల(రన్నర్స్)
షార్ట్‌పెట్	శిల్ప, అపర్ణ లిఖిత	హిందూపురం ప్రభుత్వ కళాశాల పీవీకేకే కళాశాల
డిస్కస్ త్రో	శిల్ప భవ్యశ్రీ పుష్పలత హర్షిత	హిందూపురం ప్రభుత్వ కళాశాల అనంతపురం ప్రభుత్వ కళాశాల హిందూపురం ప్రభుత్వ కళాశాల పీవీకేకే కళాశాల
లాంగ్ జంప్	భూమిక శ్రీలేఖ మీనాక్షి	మడకశిర ప్రభుత్వ కళాశాల తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాల హిందూపురం ప్రభుత్వ కళాశాల
ట్రిపుల్ జంప్	భూమిక విజ్ఞతి, త్రివేణి	మడకశిర ప్రభుత్వ కళాశాల అనంతపురం ప్రభుత్వ కళాశాల
హైజంప్	భూమిక చంద్రకవిత అనిత	మడకశిర ప్రభుత్వ కళాశాల అనంతపురం ప్రభుత్వ కళాశాల హిందూపురం ప్రభుత్వ కళాశాల

బాత్రూం డోర్ అనుకుని..

రైలు మెయిన్ డోర్ తెరిచి..

కింద పడి బీటెక్ విద్యార్థి మృతి


నిఖిల్‌కుమార్ రెడ్డి (ఫైల్)

ధర్మవరంరూరల్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): బీటెక్ విద్యార్థి రైలులో బాత్రూం డోర్ అనుకుని పొరబాటున మెయిన్ డోర్ తెరిచి, బయటకు అడుగుపెట్టాడు. కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడి మరణించాడు. మండలంలోని పోతుకుంట గ్రామానికి చందిన శ్రీనివాసరెడ్డి, సుధ దంపతుల కుమారుడు నిఖిల్‌కుమార్ రెడ్డి (21). ధర్మవరం మండలం తుమ్మల గ్రామ సమీపాన బుధవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి మరణించాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. నిఖిల్‌కుమార్ రెడ్డి చెన్నైలో బీటెక్ సెకండియర్ చదువుతుండేవాడు. సెమిస్టర్ పరీక్షలు రాసి స్వగ్రామానికి బయల్దేరాడు. అందులో భాగంగా తిరుపతికి చేరుకున్నాడు. అక్కడి నుంచి తిరుపతి-కదిరిదేవరపల్లి రైలు ఎక్కాడు. తెల్లవారుజామున తుమ్మల గ్రామ సమీపంలోకి రాగానే కాలకృత్యాలు తీర్చుకునేందుకు నిఖిల్‌కుమార్ రెడ్డి బాత్రూం డోర్ అనుకుని పొరబాటున రైలు ఎక్కే మెయిన్‌డోర్‌ను తెరిచాడు. బయటకు కాలుపెట్టడంతో పడిపోయాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నిఖిల్ కుమార్ రెడ్డి తండ్రి శ్రీనివాసరెడ్డికి ఫోన్‌చేసి, ప్రమాద విషయం తెలిపాడు. తండ్రి హుటాహుటిన ప్రమాదస్థలానికి వెళ్లి, కుమారుడిని అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ నిఖిల్‌కుమార్ రెడ్డి మృతిచెందాడు. దీంతో కుటుంబీకులు బోరున విలపించారు. ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మేడ మీద నుంచి పడి మహిళ మృతి

హిందూపురం అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక డీబీ కాలనలో మేడ మీద నుంచి ప్రమాదవశాత్తు పడి సావిత్రమ్మ(40) మరణించింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకంఠపురం ఎస్సీ కాలనీకి చెందిన సావిత్రమ్మ బీబీ కాలనీలో ఇంటి పనులు చేసేది. బుధవారం మేడ మీద ఇంటి పని చేస్తూ ప్రమాదవశాత్తు కింద పడింది. శబ్దం రావడంతో ఇంటి యజమాని బయటికి వెళ్లి చూడగా.. సావిత్రమ్మ కింద రక్తపు మడుగులో పడి ఉంది. విషయాన్ని సావిత్రమ్మ కుటుంబీకులకు తెలిపారు. ఆటోలో హిందూపురం ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. సావిత్రమ్మకు భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు.

బాబయ్య దర్గా పీఠాధిపతిగా సలావుద్దీన్‌బాబా


దర్గా నూతన పీఠాధిపతి సలావుద్దీన్‌బాబా (కుడి)

పెనుకొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన పట్టణంలోని బాబయ్యస్వామి దర్గా పీఠాధిపతిగా నజీర్‌హుస్సేని ఉరుఫ్ సలావుద్దీన్‌బాబా మంగళవారం రాత్రి బాధ్య లు తీసుకున్నారు. ప్రస్తుత పఠాధిపతి తాజ్‌బాబా పెద్ద కుమారుడు సలావుద్దీన్‌బాబా. వివిధ రాష్ట్రాలకు చెందిన పీఠాధిపతులు, మతపెద్దలు, ప్రముఖుల ఆధ్వర్యంలో తాజ్‌బాబా.. సలావుద్దీన్ బాబాకు పీఠాధిపతిగా బాధ్యతలు అప్పజెప్పారు. నూతన పీఠాధిపతికి గజమాల వేసి, శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

విద్యార్థికి తీవ్రగాయాలు

గోరంట్ల, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మరణించగా.. ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి.


బైక్‌ను ఢీకొన్న బస్సు


మహేష్‌నాయక్ మృతదేహం, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజేష్‌నాయక్

గోరంట్ల మండలంలోని పుట్టపర్తి రహదారిలో గుంతపల్లి గార్మెంట్స్ పరిశ్రమ వద్ద ద్విచక్రవాహనాన్ని బుధవారం రాత్రి కేఎస్‌ఆర్టీసీ ఢీకొన్న ప్రమాదంలో మహేష్‌నాయక్ (24) మృతిచెందగా, విద్యార్థి రాజేష్‌నాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. పుట్టపర్తి మండలంలోని పెడబల్లి తండాకు చెందిన బాబ్‌జీనాయక్ పెద్దకుమారుడు మహేష్‌నాయక్ డిగ్రీ పూర్తి చేశాడు. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన గోపేనాయక్ కుమారుడు రాజేష్‌నాయక్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. వారిరువురు ద్విచక్రవాహనంపై గోరంట్లకు పనినిమిత్తం వచ్చారు. పని ముగించుకుని స్వగ్రామానికి బయల్దేరారు. గార్మెంట్స్ పరిశ్రమ ముందు పుట్టపర్తి నుంచి బెంగళూరు వెళ్తున్న కేఎస్‌ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో మహేష్‌నాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రవంగా గాయపడిన రాజేష్‌నాయక్‌ను గోరంట్ల ఆస్పత్రికి తరలించారు. అపస్మార స్థితిలో ఉండగా మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్ చెప్పారు. ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రమాదంలో వ్యాపారి..

పెనుకొండ రూరల్: మండలంలోని ఈశ్వర్ రబ్బర ఫ్యాక్టరీ సమీపాన 44వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ద్విచక్రవాహనాన్ని కియ బస్సు ఢీకొన్న ప్రమాదంలో వ్యాపారి షేక్ అన్వర్ బాషా (59) మరణించాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనుకొండ పట్టణంలోని నారాయణమ్మ కాలనీకి చెందిన అన్వర్ బాషా.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా తోపుడుబండిపై బజ్జీలు వేసుకుని, జీవనం సాగించేవాడు. ద్విచక్రవాహనంలో మంగళవారం సాయంత్రం సోమందేపల్లికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ వద్ద వెనుకవైపు నుంచి కియ కార్మికులను తరలించే బస్సు వేగంగా ఢీకొంది. ప్రమాదంలో అన్వర్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు 108 సాయంతో పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అన్వర్ బాషాకు ఇద్దరు కుమారులున్నారు. అతడి సోదరుడు షేక్ చాంద్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

తిక్కయ్యస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో తిక్కయ్యస్వామి

ధర్మవరంరూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంతపురం గ్రామంలోని శ్రీతిక్కయ్యస్వామి ఆలయంలో బుధవారం మార్గశిర మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఏటా ఈ మాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి సిద్దయ్య తెలిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నసంతర్పణం చేసింది. రాత్రి భజనబృంద సభ్యులు భక్తిగీతాలు ఆలపించారు.

పులివాహనంపై ఊరేగిన అయ్యప్ప

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లిలోని అయ్యప్ప ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో మూడో రోజైన బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి వారిని పులి వాహనంపై ఊరేగించారు. అయ్యప్ప మాలధారులకు వ్యాయామ ఉపాధ్యాయుడు గోపీనాథ్ భిక్ష ఏర్పాటు చేశారు. గురువారం మయూర వాహనంపై స్వామి వారిని ఊరేగిస్తారు.

నేడు రెవెన్యూ సదస్సు

నల్లమాడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో గోపేపల్లి సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రంగనాయకులు తెలిపారు. గోపేపల్లి సచివాలయ పరిధిలోని గ్రామస్థులు ఈ సదస్సులో సమస్యలపై వినతి పత్రాలు అందించాలని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్‌పై అవగాహన

ధర్మవరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్-2047పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నారాయణస్వామి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు వెంకటరాముడు, గోపాల్‌నాయక్, చిట్టెమ్మ, కిరణ్‌కుమార్, త్రివేణి, షమీవుల్లా, పావని, భువనేశ్వరి, పుష్పావతి, మీనా తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం

కదిరి అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ విస్తృతస్థాయి సమావేశాన్ని పుట్టపర్తిలోని అబ్దుల్ కలాం షాదీమహల్‌లో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు యూనియన్ నాయకులు శంకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దామోదర్‌రావు, జీవీ నరసయ్య, జోనల్ నాయకులు కుమార్, రాజశేఖర్ హాజరవుతారన్నారు. రీజియన్ పరిధిలోని ఆరు డిపోల్లో పనిచేస్తున్న డ్రైవర్లు, కండెక్టర్లు, గ్యారేజీ విభాగాల ఉద్యోగులు అధిక సంఖ్యలో ఇందులో పాల్గొనాలనీ, విజయవంతం చేయాలని కోరారు.

నియామకం



సంపంగి గోవర్ధన్

కదిరి అర్బన్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలో బుధవారం జరిగిన బీసీ సమన్వయ కమిటీ సమావేశంలో తనను కమిటీ జిల్లా చైర్మన్‌గా నియమించినట్లు పట్టణానికి చెందిన సంపంగి గోవర్ధన్ తెలిపారు. తనతో పాటు మరో 14 మందిని కో-కన్వీనర్లగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

కేసు నమోదు

గాండ్లపెంట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. మండంలోని ఓ గ్రామంలో మంగళవారం ఓ వివాహిత తన పొలంలో పని చేస్తుండగా.. అదే గ్రామానికి చెందిన మల్లికార్జున ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో అతను పారిపోయాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని.. దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా జ్యోతులు



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

మడకశిర రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కంబాల నరసింహస్వామి జ్యోతుల ఉత్సవం బుధవారం వైభంగా జరిగింది. మొక్కుబడులు ఉన్న భక్తులు వివిధ గ్రామాల నుంచి జ్యోతులతో వచ్చి జిల్లేడగుంట గ్రామం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలతో పాటు వెళ్లి కంబాల నరసంహస్వామి ఆలయ చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు.

సౌరశక్తితో విద్యుత్ బిల్లు ఆదా

గోరంట్ల, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సౌరశక్తిని వినియోగించుకోవడం ద్వారా విద్యుత్ ఛార్జీలను ఆదా చేసుకోవాలని పుట్టపర్తి విద్యుత్ ఈఈ శివరాం కోరారు. గోరంట్ల వాసవి మహల్‌లో సౌరశక్తి వినియోగంపై బుధవారం అవగాహన నిర్వహించారు. కేంద్రప్రభుత్వం సౌరవిద్యుత్‌ను ప్రోత్సహించడానికి పీఎం సూర్యఘర్‌యోజన పథకం ద్వారా సబ్సిడీ ఇస్తోందన్నారు. ప్రయోగాత్మకంగా ఈపథకం అమలుకోసం పుట్టపర్తి డివిజన్‌లోని గోరంట్లను ఎంపిక చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇందుకోసం గ్రామానికి రూ.కోటి మంజూరు చేస్తోందన్నారు. పూచీకత్తు లేకుండా రుణాలు లభిస్తాయన్నారు.

ఆవుపై గుర్తుతెలియని జంతువు దాడి

చిలమత్తూరు: అడవిలోకి మేత కోసం వెళ్లిన పాడి ఆవుపై గుర్తు తెలియని జంతువు దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైంది. ఆవుపై దాడి చేసింది చిరుత అని ఆవు యజమాని అనుమానిస్తున్నాడు. మండలంలోని ఆదెప్పల్లికి చెందిన ఆదినారాయణప్ప బుధవారం తన పాడి ఆవును దగ్గర్లోని అటవీ ప్రాంతంలోకి తోలి వచ్చాడు. ఆవు మేత మేస్తుండగా గుర్తు తెలియని జంతువు ఏదో దాడి చేసింది. గాయపడిన ఆవు రక్త గాయాలతో ఇంటికి వచ్చింది. ఆవు గొంతు, వెనుక తుంటి ఎముకల భాగాల్లో గాయాలయ్యాయి. దీంతో చిరుత దాడి చేసిందని ఆవు యజమాని అనుమానిస్తున్నాడు. అయితే చిరుత దాడి చేసిన విషయాన్ని అటవీశాఖ అధికారులతో చెప్పగా, ఈ ప్రాంతంలో చిరుతలు లేవన్నారు.

సచివాలయాలు

అవుట్ ఆఫ్ సర్వీస్







కొత్తపేటలోని వార్డు సచివాలయం, పని చేయని కంప్యూటర్, యూపీఎస్

- పాలన అస్తవ్యస్తం...
- పనిచేయని కంప్యూటర్లు, యూపీఎస్, డివైజర్లు
- వీటికి తోడు నెట్‌వర్క్, సర్వర్ సమస్యలు
- సేవలు అందక ప్రజల ఇబ్బందులు
- సెల్‌ఫోన్ల సాయంతో నెట్టుకొస్తున్న సిబ్బంది

ధర్మవరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని వార్డు సచివాలయాల్లో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. అయితే సాంకేతిక కారణాల వల్ల సచివాలయాలు ప్రజలకు సేవలు అంతంత మాత్రంగానే అందిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం పలు సచివాలయాల్లో కంప్యూటర్లు, యూపీఎస్, డివైజర్లు పనిచేయకపోవడం. అంతేకాకుండా నెట్‌వర్క్, సర్వర్ సమస్య వల్ల ఆన్‌లైన్ కార్యకలాపాలకు తీవ్రఅంతరాయం ఏర్పడుతుంది. దీంతో సచివాలయ సిబ్బంది తమ సెల్‌ఫోన్ల సాయంతో నెట్టుకొస్తున్నారు.

● సిబ్బంది పాట్లు

పట్టణంలో మొత్తం 39 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఇందులో చాలా వరకు సమస్యలతో సతమతమవుతున్నాయి. సాంకేతిక సమస్యల వల్ల సకాలంలో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ప్రధానంగా కుల, ఆదాయ, ఆధార్, పన్నులు, దరఖాస్తులు చేసుకోవాలన్నా సచివాలయాల ద్వారానే నిర్వహించాల్సి ఉంది. అయితే కంప్యూటర్లు మొరాయించడం, నెట్‌వర్క్ లేకపోవడం, యూపీఎస్, డివైజ్‌లు పనిచేయకపోవడం తదితర సమస్యలు సిబ్బందిని పట్టి పీడిస్తున్నాయి. అపార్ నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎక్కువగా సచివాలయాలకు వస్తున్నారు. అక్కడ కంప్యూటర్లు పని చేయకపోవడంతో సమస్యలు రోజుల తరబడి పరిష్కారం కావడం లేదు. దీంతో కొంతమంది సచివాలయ సిబ్బందే సొంత డబ్బులతో వాటిని రిపేరీ చేయించుకొని.. సేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా కార్యాలయంలో స్టేషనరీ కావాలన్నా తమ సొంత డబ్బులతో సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది వాపోతున్నారు.

● సేవల్లో జాప్యం

సచివాలయాల్లో నెలకొన్న సాంకేతిక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారు రోజుల తరబడి పనులు సక్రమంగా జరగక.. సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఉన్నతాధికారులు సచివాలయాల్లోని సమస్యలను గుర్తించి.. వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పరిష్కరిస్తున్నాం

పట్టణంలోని వార్డు సచివాలయాల్లో నెలకొన్న సాంకేతిక పరమైన సమస్యలు ఒక్కొక్కటీ పరిష్కరిస్తున్నాం. క్రమంగా అన్ని సచివాలయాల్లో సమస్యలు పరిష్కరించి ప్రజలకు సక్రమంగా సేవలు అందేలా చూస్తాం.

- ప్రమోద్‌కుమార్, కమిషనర్, ధర్మవరం

సమస్యల పరిష్కారానికి కృషి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



పరిటాల శ్రీరామ్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ధర్మవరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పద్మశాలీయ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో పరిటాల శ్రీరామ్‌ను పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు పుత్తారుద్రయ్య, ఉపాధ్యక్షుడు జింకా నాగభూషణం, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. పరిటాల శ్రీరామ్, ఆ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులను సభ్యులు గజమాలతో సన్మానించారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... గత ఎన్నికలలో పద్మశాలీయులు కూటమి గెలుపు కోసం చాలా కృషి చేశారన్నారు. పద్మశాలీలలో ఎక్కువగా చేనేత రంగంపై ఆధారపడి ఉన్నారని, వారి సమస్యలను ఇప్పటికే చేనేత జౌళిశాఖ మంత్రి సవిత, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీనివాస్‌ల దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధారాఘవ, టీడీపీ నాయకులు జింకాపురుషోత్తం, పద్మశాలియ సంఘం నూతన సంఘం ప్రధాన కార్యదర్శి మెటికల బాల, కోశాధికారి వడకల బాస్కర్, సభ్యులు గుర్రం గంగాధర్, జానపాటి మోహన్, ఊట్ల నరేంద్ర, జింకాగిరి, శేపూరి ప్రకాశ్, లక్ష్మీనారాయణ మార పురుషోత్తం, యారవరాము, కట్టా సతీశ్ పాల్గొన్నారు.

● అయ్యప్పస్వామికి పూజలు

స్థానిక చెరువుకట్ట వద్దగల అయ్యప్పస్వామి భజన మందిరంలో పరిటాల శ్రీరామ్ ప్రత్యేక పూజలు చేయించారు. తన మేనకోడలు వడ్డమూడిమీరా పేరు మీదుగా మాలధారులకు భిక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. పూజల్లో ఏపీసీడ్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కమతం కాటమయ్య, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్‌చౌదరి పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

కేంద్రమంత్రి గడ్కరీని కోరిన మంత్రి సత్యకుమార్



కేంద్రమంత్రి గడ్కారితో మంత్రి సత్యకుమార్

ధర్మవరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం, ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరిని కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర మంత్రి కేంద్ర మంత్రిని బుధవారం కలిసి వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందజేశారు. కేంద్రమంత్రి స్పందించి.. అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు.

ఆస్పత్రిలో జనరేటర్ ప్రారంభం



జనరేటర్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నకర్

పుట్టపర్తి/రూరల్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో ఎలాంటి కాలుష్యం విడుదల చేయని అత్యాధునిక 1010 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన డీజిల్ ఎలక్ట్రికల్ జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. దాదాపు రూ.95 లక్షల విలువైన దీనిని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ గురుమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనజీవామృతం తయారీపై శిక్షణ



ఘనజీవామృతంపై శిక్షణ ఇస్తున్న సిబ్బంది

తనకల్లు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుట్టపల్లి గ్రామంలో ఘన జీవామృతం తయారీ విధానంపై రైతులకు బుధ వారం శిక్షణ ఇచ్చారు. ఘనజీవామృతాన్ని ఎలా తయారు చేసుకోవాలో చూపించారు. రైతులు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు ఎక్కువగా వాడడం వలన వ్యవసాయ భూములు నిసత్వవుగా మారిపోతున్నాయని జనజాగృతి వ్యవసాయ సాంకేతిక సలహాదారు సుప్రియ తెలిపారు. రైతులు కచ్చితంగా ద్రవ, ఘనజీవామృతం, కషాయాలను ఉపయోగించి భూమిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

పశువుల మృతికి పరిహారం కలేనా?



- గత ఐదేళ్లు పాడి పశువులకు దక్కని బీమా
- ప్రమాదాల్లో మృతిచెందినా పట్టించుకోని వైనం
- కూటమి ప్రభుత్వంపై ఆశలు
- బీమా సౌకర్యం కల్పించాలంటున్న పాడి రైతులు

చిలమత్తూరు,డిసెంబరు18(ఆంధ్రజ్యోతి):వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా చేసుకుంటున్న పశుపోషణకు గత వైసీపీ ప్రభుత్వంలో ఏమాత్రం ప్రోత్సాహం అందలేదు. దాంతో పాడి పరిశ్రమపై ఆధారపడిన కుటుంబాల ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారైంది. సొంతంగా కొనుగోలు చేసి పోషించుకుంటున్న పశువులకు కనీసం బీమా కల్పించలేని పరిస్థితిలో గత వైసీపీ ప్రభుత్వం ఉందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత ప్రభుత్వ కాలంలో ప్రమాదాల వలన, రోగాల బారిన పడి పశువులు మృతి చెందితే పరిహారం పొందేవిధంగా బీమా చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. దాంతో చాలా మంది రైతులు వేల రూపాయల విలువచేసే పాడి ఆవులను కోల్పోయి తీవ్రంగా నష్టపోయారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న పాడి పశువు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పశు నష్ట పరిహారం అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఏడాదిగా పశువులకు అందని బీమా

2014-2019 కాలంలో బీమా కంపెనీలకు నేరుగా బీమా ప్రీమియం చేయడం చెల్లించడం ద్వారా ఎప్పుడైనా పశునష్టం జరిగితే వెంటనే నష్ట పరిహారం అందేది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొంత కాలం బీమా అమలుచేసి ఆ తరువాత దానిని అటకెక్కించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పాడి రైతులు పశుబీమా కోసం ఎదురు చూస్తున్నారు. తమ పాడి పశువులు ప్రమాదాలకు గురై మృతి చెందినప్పుడు నష్టపోకుండా కొందరు రైతులు గత ప్రభుత్వం చివరిదశలో, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా మండలవ్యాప్తంగా బీమా ప్రీమియం చెల్లించారు. బడ్జెట్‌లో పశుబీమాకి సంబంధించిన నిధులు లేకపోవడంతో నష్టపోయిన రైతులకు ఇప్పటికీ పరిహారం అందడం లేదు. దాంతో మృతిచెందిన పాడిపశువులకు బీమా అందకుండా పోతోంది. పాడి పశువులకు బీమా అందజేయడంలో ప్రైవేటు బీమా సంస్థలే నయమని రైతులు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వం తామే ప్రీమియం చెల్లించుకొని నష్టపరిహారంగా ఒక్కో పాడి ఆవుకి రూ.30 వేలు అందిస్తామని చెప్పినా... నిధుల కొరత అంటూ ఐదేళ్లు గడిపారని రైతులు వాపోతున్నారు. అయితే అప్పుడు చెల్లించిన ప్రీమియం ప్రైవేటు సంస్థలకు చెల్లించి ఉంటే సత్వరమే పరిహారం అందేదని అంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మి ప్రైవేటు సంస్థలకు ప్రీమియం చెల్లించకుండా వేల రూపాయలను నష్టపోయామంటున్నారు.

- కూటమిపై ఆశలు

వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పశుపోషణను ప్రధాన వృత్తిగా ఎంచుకుంటున్నారు. దీంతో పశుపోషణ రోజురోజుకి పెరుగుతోంది. గత ప్రభుత్వంలో పాడి రైతులకు ఎలాంటి పోత్సాహకాలతో పాటు పశుభీమా లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల్లో ఆశలు తిరిగి చిగురిస్తున్నాయి. పశుబీమాను అమలుచేసి పాడి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నెలలో అమలు కావచ్చు

గత ప్రభుత్వం హయాంలో కొందరు రైతుల నుంచి బీమా ప్రీమియం సేకరించి ప్రభుత్వానికి పంపాము. అయితే బీమా అమలుకాలేదు. దాంతో రైతుల నుంచి ప్రీమియం తీసుకోవడం నిలిపివేశాము. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పశు బీమాపై చర్చించారు. పైఅధికారుల నుంచి వచ్చిన సమాచారం మేరకు నెల రోజుల్లో పథకం అమలయ్యే అవకాశం ఉంది.

-పురుషోత్తం రెడ్డి, మండల పశువైద్యాధికారి

సీఐ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ధర్మవరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి ఇటీవల హత్యకు గురైన విషయం తెలిసిందే. దీంతో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ధర్మవరంలో నివాసముంటున్న సీఐ నాగేంద్రప్రసాద్ ఇంటికి వెళ్లి.. ఆయనను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. జరిగిన సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు.



సీఐని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

మామిడి మొక్కల అందజేత

కొత్తచెరువు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని 10 పాఠశాలలకు రూ. 10 వేల విలువైన 250 మామిడి మొక్కలను సత్యసాయి బాబా భక్తులు బుధవారం అందజేశారు. మండలంలోని తలమర్ల, మీర్జాపురం, మరకుంటపల్లి, వంగంపల్లి, బండ్లపల్లి, కేశాపురం, పాతదేవరపల్లి, నారేపల్లి పాఠశాల్లోని విద్యార్థులకు ఆ మొక్కలను అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణంలో వాటిని నాటించారు.



మామిడిమొక్కలు అందిస్తున్న భక్తులు

బాధితుడికి ఆర్థికసాయం

ధర్మవరంరూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడన్నపల్లి గ్రామానికి చెందిన శివయ్యకు చెందిన గొర్రెలు రైలు ఢీకొని మరణించిన విషయం తెల్సిందే. టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, బీసీ సంఘం నాయకులతో కలిసి బుధవారం గ్రామానికి వెళ్లి శివయ్య కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీసీ సంఘం నాయకులు శంకరప్ప, తిరుపాలు ఉన్నారు.

పరిహారం అందించి.. ఆదుకోండి

● ధర్మవరం : రైలు ఢీకొని 40 గొర్రెలు చనిపోవడంతో బడన్నపల్లి గ్రామానికి గొర్రెలకాపరి శివయ్య తీవ్రంగా నష్టపోయారని, పరిహారం ఇచ్చి ప్రభుత్వమే అతన్ని ఆదుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్ అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ.. గతంలో గొర్రెలు, మేకలు, పశువులకు ప్రభుత్వాలే బీమా చెల్లించి అన్నిరకాలుగా ఆదుకునేవని, కానీ గత ప్రభుత్వం పశువుల బీమాను రద్దు చేయడంతో అనేక మంది తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పశువులకు బీమా విధానాన్ని తిరిగి అమలు చేయాలన్నారు.

తూకాల్లో తేడాలొస్తే చర్యలు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): చౌకధాన్యపు డిపోల్లో డీలర్లు తూకాలు సక్రమంగా నిర్వహించాలని, తూకాల్లో తేడాలొస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ అనంతాచారి హెచ్చరించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు సకాలంలో నిత్యావసర వస్తువులు అందించాలన్నారు. అనంతరం బఫర్ స్టాక్‌పై డీలర్లతో చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌చార్జీ ఆర్ఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఏకగ్రీవం

ధర్మవరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కేతిరెడ్డికాలనీలో ఎమ్మార్పీఎస్ పట్టణ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎంపికచేశారు. పట్టణ అధ్యక్షుడిగా కోదండరాముడు, ఉపాధ్యక్షుడిగా సాకే నరసింహులు, ప్రధాన కార్యదర్శి సాకే నరేశ్ ఎంపిక చేశారు. అదేవిధంగా ఎంఎస్‌పీ కమిటీ అధ్యక్షుడిగా సాకే నల్లప్ప, ఉపాధ్యక్షుడిగా సుధాకర్‌ను ఎంపికచేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బూదెప్ప మాట్లాడుతూ... త్వరలో అనంతపురం జిల్లాలో మాదిగల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, మందక్రిష్ణ మాదిగ పాల్గొనే ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సాకే నాగరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

సౌరశక్తితో విద్యుత్ బిల్లు ఆదాచేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ ఈఈ శివరాం

గోరంట్ల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):ప్రతిఒక్కరు సౌరశక్తిని వినియోగించుకోవడం ద్వారా విద్యుత్ ఛార్జీలను ఆదా చేసుకోవాలని పుట్టపర్తి విద్యుత్ ఈఈ శివరాం కోరారు. గోరంట్ల వాసవి మహల్‌లో సౌరశక్తి వినియోగంపై బుధవారం అవగాహన నిర్వహించారు. కేంద్రప్రభుత్వం సౌర విద్యుత్‌ను ప్రోత్సహించడానికి పీఎం సూర్యఘర్‌యోజన పథకం ద్వారా సబ్సిడీ ఇస్తోందన్నారు. ప్రయోగాత్మకంగా ఈపథకం అమలుకోసం పుట్టపర్తి డివిజన్‌లోని గోరంట్లను ఎంపిక చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇందుకోసం గ్రామానికి రూ.కోటి మంజూరు చేస్తోందన్నారు. ఎలాంటి పూచీకత్తులేకుండా రుణాలు లభిస్తాయన్నారు. ఈకార్యక్రమంలో విద్యుత్‌శాఖ డిఈఈ శర్వనస్, ఎఈలు, వివిధ సోలార్ కంపెనీల ప్రతినిధులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

సత్వరమే భూసమస్యల పరిష్కారం

చిలమత్తూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో భూసమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ యునస్ బాబు పేర్కొన్నారు. మండలంలోని హసేన్‌పురంలో బుధవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు సజావుగా ఉంటే వాటికి వెంటనే పరిష్కారాలు ఉంటాయన్నారు. ప్రధానంగా భూసర్వే, పట్టాదార్ పాసుపుస్తకాల మంజూరు వంటి రెవెన్యూ శాఖకు సంబంధించిన ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలపై అర్జీలనుసదస్సులో అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటిలో వెళ్లేదెలా?



రోడ్డుపైకి చేరిన మురుగునీరు

పెనుకొండ టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగర పాలక పంచాయతీ పరిధిలోని ఆల్విన్‌కాలనీలో రహదారిపై మురుగునీటిలో రాకపోకలు ఎలా కొనసాగించాలని కాలనీవాసులు మండిపడుతున్నారు. ఈ దారంతా మురుగునీరు చేరడంతో మరోదారి వెంట పోవాల్సి ఉంటుందని ఆదారికూడా ముళ్లకంపలతో ఉందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసి అంజినమ్మ మాట్లాడుతూ, తాము శివాలయం సమీపంలో నివాసమున్నామని ఈ మురుగునీరు రోడ్డుపైకి రావడంతో ఇంటికి వెళ్లేదారిలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సమీపంలోని హోటళ్లకు సంబంధించిన నీటిని ఈ రోడ్డుపైకి వదులుతున్నారని, పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు.

ఎట్టకేలకు బొమ్మపై రంగుపడింది



మణూరులోని రైతు సేవా కేంద్రం

మడకశిర రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) మండలంలోనిమణూరు రైతు సేవాకేంద్రంపై ఉన్న మాజీ సీఎం బొమ్మ కనిపించకుండా సంబంధిత అధికారులు రంగులు వేశారు. ఈ నెల 15న ఆంధ్రజ్యోతిలో నేటికి మార్పు రాలేదు అనే శీర్షికతో ప్రచురితమైౖ వార్తకు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంబంధిత అధికారులు స్పందించారు. రైతు సేవాకేంద్రంపై ఉన్న మాజీ సీఎం బొమ్మను తొలగించి రైతు భరోసా కేంద్రాన్ని రైతు సేవా కేంద్రంగా మార్చుచేశారు.

శ్మశానానికి భూమిని కేటాయించండి

అగళి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అగళి మండల కేంద్రంలో బీసీలకు శ్మశానవాటిక భూమిని కేటాయించాలని అదేవిధంగా వైశ్యులకు, బ్రాహ్మణులకు దహనవాటిక కోసం భూమిని కేటాయించాలని జెడ్పీటీసీ ఉమేష్ తహసీల్దార్ సుబ్బారావుకు వినతిపత్రం అందించారు. అగళి మండలంలోని శంకరేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో అన్ని శాఖల అధికారులతోపాటు జెడ్పీటీసీ సభ్యుడు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగళి మండల కేంద్రంలో శ్మశానవాటిక భూమిలేదని దీంతో మృతదేహాలను ఎక్కడబడితే అక్కడ పూడ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులు సీరియస్‌గా తీసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శ్మశానవాటికకు భూమిని కేటాయించాలని విన్నవించారు.

ఆయాలకు కార్యకర్తలుగా ప్రమోషన్ ఇవ్వండి

హిందూపురం అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అర్హులైన ఆయాలను కార్యకర్తలుగా ప్రమోట్ చేయాలని అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, ప్రాజెక్టు కార్యదర్శి శోభ, ప్రాజెక్టు అధ్యక్షురాలు అరుణలు మంగళవారం ఇన్‌ఛార్జి సీడీపీఓ శాంతిని కలిసి వినతి అందించారు. హిందూపురం అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలో చిలమత్తూరుకు శెట్టిపల్లి, హిందూపురం పరిధిలోని అంబేద్కర్‌నగర్, నరసాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు పీడీకి పంపుతామని అయితే అందుకు ప్రభుత్వం నుంచి కొన్ని అర్హతలు ఉన్నాయని ఆయా అంగన్‌వాడీగా ప్రమోట్ కావాలంటే తప్పని సరిగా పదవతరగతి పాస్ అయి ఉండాలని సీడీపీఓ తెలిపారు.

రథం మరమ్మతులకు విరాళాలు ఇవ్వండి

హిందూపురం అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని శ్రీ పేట వేంకటేశ్వరస్వామి ఆలయ రథం మరమ్మతులకు భక్తులు విరాళాలు ఇచ్చి సహకరించాలని ఆలయ ఈఓ నరసింహమూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరమ్మతులకు గాను దాదాపు రూ.12 లక్షలు ఖర్చు అవుతుందని భక్తులు, దాతలు ముందుకొచ్చి విరాళాలు అందించి దైవ సేవలో పాలుపంచుకొని దైవ కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

పశువుల మృతికి పరిహారం కలేనా?



- గత ఐదేళ్లుగా పాడి పశువులకు దక్కని బీమా
- ప్రమాదాల్లో మృతిచెందినా పట్టించుకోని వైనం
- కూటమి ప్రభుత్వంపై ప్రజల ఆశలు
- బీమా సౌకర్యం కల్పించాలంటున్న పాడి రైతులు

చిలమత్తూరు,డిసెంబరు18(ఆంధ్రజ్యోతి):వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా చేసుకుంటున్న పశుపోషణకు గత వైసీపీ ప్రభుత్వంలో ఏ మాత్రం ప్రోత్సాహం అందలేదు. దాంతో పాడి పరిశ్రమపై ఆధారపడిన కుటుంబాల ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారైంది. సొంతంగా కొనుగోలు చేసి పోషించుకుంటున్న పశువులకు కనీసం బీమా కల్పించలేని పరిస్థితిలో గత వైసీపీ ప్రభుత్వం ఉందని రైతులు గొగ్గోలు పెడుతున్నారు. గత ప్రభుత్వ కాలంలో ప్రమాదాల వలన, రోగాల బారిన పడి పశువులు మృతి చెందితే పరిహారం పొందే విధంగా బీమా చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. దాంతో చాలా మంది రైతులు వేల రూపాయల విలువచేసే పాడి ఆవులను కోల్పోయి తీవ్రంగా నష్టపోయారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న పాడి పశువు మృతిచెందడంతో తీవ్రంగా నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన నష్ట పరిహారం అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఏడాది కాలంగా పశువులకు అందని బీమా

2014-2019 కాలంలో బీమా కంపెనీలకు నేరుగా బీమా ప్రీమియం చెల్లించడంద్వారా ఎప్పుడైనా పశునష్టం జరిగితే వెంటనే నష్టపరిహారం అందేది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొంత కాలం బీమా అమలుచేసి ఆ తరువాత దానిని అటకెక్కించారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు పాడి రైతులు పశుబీమా కోసం ఎదురు చూస్తున్నారు. తమ పాడి పశువులు ప్రమాదాలకు గురై మృతి చెందినప్పుడు నష్టపోకుండా కొందరు రైతులు గత ప్రభుత్వం చివరిదశలో, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా మండల వ్యాప్తంగా బీమా ప్రీమియం చెల్లించారు. అయితే బడ్జెట్‌లో పశుబీమాకి సంబంధించిన నిధులు లేకపోవడంతో నష్టపోయిన రైతులకు ఇప్పటికీ పరిహారం అందడం లేదు. దాంతో మృతిచెందిన పాడిపశువులకు బీమా అందకుండా పోతోంది.

పాడి పశువులకు బీమా అందజేయడంలో ప్రైవేటు బీమా సంస్థలే నయమని రైతులు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వం తామే ప్రీమియం చెల్లించుకొని నష్టపరిహారంగా ఒక్కో పాడి ఆవుకి రూ. 30 వేలు అందిస్తామని చెప్పినా... నిధుల కొరత అంటూ ఐదేళ్ల గడిపారని రైతులు వాపోతున్నారు. అయితే అప్పుడు చెల్లించిన ప్రీమియం ప్రైవేటు సంస్థలకు చెల్లించి ఉంటే సత్వరమే పరిహారం అందేదని అంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మి ప్రైవేటు సంస్థలకు ప్రీమియం చెల్లించకుండా వేల రూపాయలను నష్టపోయామంటున్నారు.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పశుపోషణను ప్రధాన వృత్తిగా ఎంచుకుంటున్నారు. దీంతో పశుపోషణ రోజురోజుకి పెరుగుతోంది. గత ప్రభుత్వంలో పాడి రైతులకు ప్రోత్సాహకాలతో పాటు పశుబీమా లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల్లో ఆశలు తిరిగి చిగురిస్తున్నాయి. పశుబీమాను అమలు చేసి పాడి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పశువులకు బీమా ఉంటే ధీమాగా ఉంటాం



పాడి పశువుల ఆధారంగా జీవిస్తున్న మాకు పశుబీమా పథకం అమల్లో ఉంటే ఎంతో ధీమాగా ఉంటుంది. ఒక్కో పాడి ఆవు రూ. 70 వేల నుంచి రూ. లక్ష వరకు ధర పలుకుతోంది. దీంతో పాడి పశువులు ప్రమాదవశాత్తు మృతిచెందితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.కూటమి ప్రభుత్వం పశుబీమా అమలుచేయాలని కోరుతున్నా.

చెన్నక్రిష్ణ, పాడి రైతు

నెల రోజుల్లో పథకం అమలయ్యే అవకాశాలు

గత ప్రభుత్వం హయాంలో కొందరు రైతుల నుంచి బీమా ప్రీమియం సేకరించి ప్రభుత్వానికి పంపాము. అయితే బీమా అమలుకాలేదు. దాంతో రైతుల నుంచి ప్రీమియం తీసుకోవడం నిలిపివేశాము. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పశుబీమాపై చర్చించారు. పైఅధికారుల నుంచి వచ్చిన సమాచారం మేరకు నెల రోజుల్లో ఈ పథకం అమలయ్యే అవకాశం ఉంది.

- పురుషోత్తం రెడ్డి, మండల పశువైద్యాధికారి

పెనుకొండలో అలరిస్తున్న బాబయ్య ఉరుసు



ఖవాలీ పాటలు ఆలపిస్తున్న గాయకులు

పెనుకొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : బాబయ్యస్వామి దర్గా ఉరుసు ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో పెనుకొండలో ఉరుసు సందడి నెలకొంది. ఉరుసు సందర్భంగా బాబయ్యదర్గా ముఖద్వారంతోపాటు దర్గా మొత్తం విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వచ్చిన భక్తులకు కాలక్షేపం కోసం దర్గా పక్కన ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, పిల్లలకు, మహిళలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉరుసులో ఏర్పాటు చేసిన గాజుల దుకాణాలు, ఇతర దుకాణాలన్నీ కొనుగోలు దారులతో కిటికిటలాడుతున్నాయి. భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన ఖవాలి పాటలు ఆకర్షించాయి.



ఉరుసులో ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్

కంది పంట తెగులుకు డ్రోన్ చికిత్స

- యాంత్రీకరణవైపు మొగ్గుచూపుతున్న రైతులు
- బాబు రాకతో సాంకేతిక పరిజ్ఞానానికి ఊతం

మడకశిరటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక సాంకేతిక పరిజ్ఞానం యాంత్రీకరణకు ప్రోత్సాహం అందిస్తుండటంతో రైతులు కూడా ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. మంచు తుపాను కారణంగా కంది పంటకు చీడపీడలు రావడం వల్ల వాటిని కాపాడుకొనేందుకు రైతులు డ్రోన్ పరికరం ద్వారా కందిపంటకు సోకిన తెగుళ్ల నివారణకు మందులు పిచికారి చేస్తున్నారు. కందిపంటకు కాయతొలిచే పురుగు రావడం వల్ల పంట చివరి దశలో దెబ్బతింటుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరి దశలో పంటను కాపాడుకొనేందుకు పట్టణ సమీపంలోని రైతు శంకర్‌రెడ్డి హిందూపురం నుండి డ్రోన్ కెమెరాను అద్దెకు తీసుకొచ్చి కంచిపంటకు మందులు పిచికారి చేశారు. ఒక ఎకరా పిచికారి చేయడానికి రూ.850లు చొప్పున డ్రోన్ యజమానులకు అద్దె చెల్లించి డ్రోన్ కెమెరాల ద్వారా పంట రక్షించుకొనేందుకు రైతులు చివరి ప్రయత్నం చేస్తున్నారు. డ్రోన్‌కెమరా రైతులు సొంతంగా కొనుగోలు చేసేందుకు రూ.8లక్షల వరకు పెట్టుబడి అవసరమవుతుందని రైతులు అంటున్నారు. ఇటీవల కాలంలో విజయవాడలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాల వాడకంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించడంతో మారుమూల ప్రాంతాల్లో సైతం వాటిని వాడేందుకు ఆసక్తిని చూపుతున్నారు. కంది సంబంధించి చెట్లు పచ్చగా ఎదిగినా ఎండ వేడిమి తగలకపోవడం, తరచూ తుపాను ప్రభావంగా పూత దశలోనే పంటపై ప్రభావం చూపిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోత దశలో సైతం వర్షం పడుతుండటంతో కాచిన కాయలు నల్లబడి పోతోందని అంటున్నారు. మరోవైపు తెగుళ్ల వల్ల మరింత నష్టపోవాల్సి వస్తుందన్న ఉద్దేశంతో డ్రోన్ కెమెరాల సహాయంతో పిచికారి చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన మందులను ముందుగానే అందులో నింపి డ్రోన్‌ల సహాయంతో సుదూరు ప్రాంతంలో నిలబడి చివరి చెట్టువరకు స్ప్రే చేస్తుండటంతో అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.



కందిపంటపై రసాయన ద్రావణాన్ని పిచికారి చేస్తున్న డ్రోన్

ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి కృషి

పావగడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని ఎస్సీ, ఎస్టీ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి ప్రతి అధికారి పనిచేయాలని తహసీల్దార్ వరదరాజు అధికారులకు సూచించారు. బుధవారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన తాలూకా స్థాయి ఎస్సీ, ఎస్టీ హితరక్షణ సమితి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు తమ దృష్టికి వచ్చిన సమస్యలన్నీ సంబంధిత అధికారుల సాయంతో పరిష్కరించామని, బగర్‌హుకుం కమిటీ సభలో కొన్ని భూములు తమ పరిధిలో లేనందు వల్ల పెండింగ్‌లో ఉంచామని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న నర్సులకు వచ్చిన జీతాలలో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై సేవ చేసేవారికి మోసం చేస్తున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈసమస్యను డిసెంబరులోపు సంబంధిత అధికారులతో చర్చించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకొంటామని ఆయన తెలిపారు. ఈసందర్భంగా ఈఓ జానకిరామ్, ఇన్‌స్పెక్టర్ సురేష్, సాంఘిక సంక్షేమ అధికారి మల్లికార్జున, ప్రజా పనుల శాఖ అధికారి అనీల్‌కుమార్, మున్సిపల్ ముఖ్య అధికారి జాఫర్‌షరీఫ్, పీఈఓ ఇంద్రాణి, అటవీ శాఖ అధికారి రాకేష్ పాల్గొన్నారు.

ఫసల్ బీమా యోజన రైతులకు వరం : ఏఓ

గుడిబండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన క్రాప్ ఇన్సూరెన్స్ రైతులకు వరం లాంటిదని ఏఓ వీరనరేష్, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ప్రతినిధి మేనేజర్ బాయరెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని కరికెర, చిగతుర్పి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రబీ సీజన్‌లో బోరు బావుల కింద సాగుచేసిన వరి, వేరుశనగ, మామిడి, తదితర పంటలకు ఈనెల 31వతేదీలోపు ఇన్సూరెన్స్ ప్రీమియంను చెల్లించాలన్నారు. రైతులు సాగుచేసి నష్టపోతే బీమా వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా రైతులు వ్యవసాయ సాగులో సస్యరక్షణ చేపట్టి అధిక దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం వ్యవసాయ సాగుపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఏఈఓలు హేమలత, రైతు సేవా కేంద్రం ప్రతినిధి శంకర్‌రెడ్డి, జ్యోతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

23న లోకాయుక్త ప్రజావాణి

పావగడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 23న పట్టణంలోని తాలూకా పంచాయతీ కార్యాలయంలో ప్రజల సమస్యలు, ఫిర్యాదులపై తుమకూరు పోలీసు లోకాయుక్త కమీషనర్ ఆధ్వర్యంలో ప్రజా వాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ జానకిరామ్ తెలిపారు. పంచాయతీ పరిధిలోని పీడీఓలు సంబంధిత అభివృద్ధి, ప్రగతి పనులకు సంబంధించిన దాఖలాలతో హాజరుకావాలని ఆయన సూచించారు. ప్రభుత్వ అధికారులు పనితీరు, నిర్లక్ష్యం, అవినీతికి పాల్పడే వారిపై లిఖిత పూర్వకంగా అర్జీలు ఇవ్వవచ్చని ఆయన తెలిపారు. ఈవిషయాన్ని ప్రతి గ్రామ పంచాయతీ పీడీఓ గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు తెలియజేయాలన్నారు.

ఏడీ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధులకు చికిత్స



శిబిరంలో పాల్గొన్న డాక్టర్ అమర్‌నాథ్

రొళ్ల, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి):రొళ్లమండలం కె.బ్యాడిగెర గ్రామంలో మడకశిర సహాయ సంచాలకులు ఏడీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గర్భకోశ చికిత్సా శిబిరం నిర్వహించారు. పశు గణాభివృద్ధి సంస్థ నిర్వహణ అధికారి డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్ మాట్లాడుతూ భవిష్యత్తులో లింగ నిర్ధారణ వీర్యం ప్రాచుర్యం పొందుతుందని, పశువుల్లో అత్యధిక పాల ఉత్పత్తి కోసం పెయ్యి దూడలు మాత్రమే పొందే ఆధునిక సాంకేతిక విప్లవంగా ఈపథకం మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా పశువులలో చూడి నిర్ధారణ, ఎదుగుల, ఎత్తు, తదితర సమస్యలకు చికిత్స చేశారు. దాదాపు 35 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, జూనియర్ డాక్టర్ వెంకటేష్, శశికళ, వనిత, మంజునాథ్, శశియాదవ్, గోపాలకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

శోత్రియం భూముల సమస్యలను పరిష్కరించండి

గుడిబండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):ఎస్.రాయాపురం గ్రామంలోని శోత్రియం భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని ఎస్.రాయాపురం గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ రామ్‌భూపాల్‌రెడ్డి, సర్వేయర్ ఫణికిశోర్ ఆధ్వర్యంలో బుధవారం రెవిన్యూ సదస్సును నిర్వహించారు. ఈసమావేశానికి రైతులు హాజరయ్యారు. ఈసందర్భంగా రైతులు ఎం.నాగేంద్రప్ప, రామతమ్మణ్ణ, సన్నీరప్ప తదితర రైతులు మాట్లాడుతూ ఎస్.రాయాపురం శోత్రియం భూముల్లో ఎంతో మంది రైతులు సాగు చేసుకొంటున్నారని, సాగుచేసే రైతులకు రైత్వారీ పట్టాలు అందించి పాసుపుస్తకాలు అందించాలని అధికారులను కోరారు. అదేవిధంగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు విన్నవించారు. గ్రామంలో ఎంతో మందికి ఇంటి పట్టాలు, ఇళ్లు నిర్మించుకోవడానికి స్థలం లేకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఉత్సవాల్లో ఆర్టీసీకి రూ.4లక్షల ఆదాయం

మడకశిరటౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):భక్తరహళ్లి నరసింహస్వామి, జిల్లెడిగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మడకశిర ఆర్టీసీ డిపోకు రూ.4లక్షలు ఆదాయం వచ్చినట్లు మేనేజర్ రామసుబ్బయ్య తెలిపారు. భూతప్పల ఉత్సవం, జ్యోతుల ఉత్సవం సందర్భంగా నియోజకవర్గం వ్యాప్తంగా భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను నడిపామన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

మడకశిర రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కంబాల నరసింహస్వామి జ్యోతుల ఉత్సవం బుధవారం వైభవంగా జరిగింది. మొక్కుబడులు ఉన్న భక్తులు వివిధ గ్రామాల నుంచి జ్యోతులతో వచ్చి జిల్లేడగుంట గ్రామం నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో పాటు వెళ్ళి కంబాల నరసంహస్వామి ఆలయ చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

విద్యుత్ ఆదాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అగళి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాల విద్యార్థులచే విద్యుత్ వినియోగం ఆదాచేయడంపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎనర్జీ క్లబ్ ద్వారా ఎనర్జీ వీక్‌లో భాగంగా విద్యుత్‌ను ఎలా ఆదాచేయాలనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదర్శ పాఠశాల నుంచి పురవీధుల గుండా ప్లకార్డులు చేత పట్టుకుని ర్యాలీగా వెళ్లి బస్టాండు ఆవరణంలో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాఫర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామైక్య మహిళా సంఘాలకు శిక్షణ తరగతులు

అమరాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల కేంద్రంలోని స్థానిక హేమ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం గ్రామైక్య సంఘాలకు, మండల సమాఖ్య ఈసీ మెంబర్లకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఏపీఎం ముత్యాలప్ప తెలిపారు. ఈకార్యక్రమంలో 46 గ్రామైక్య సంఘాలవారు శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో వెలుగు సిబ్బంది, అకౌంటెంట్‌లు, సీఆర్‌పీలు మరియు ఏపీఎం ముత్యాలప్ప, ఎల్‌సీ లక్ష్మీకాంత్, లక్ష్మీనరసప్ప, శ్రీధర్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 13 అర్జీలు

మడకశిరటౌన్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి రెవిన్యూ సదస్సులు ఎంతో దోహద పడతాయని తహసీల్దార్ కరుణాకర్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో మడకశిర గ్రామ రెవిన్యూ పరిధిలో జరిగిన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భలంగా 13 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ప్రజలకు ఇబ్బందులు

పరిగి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ కంపెనీకి విద్యుత్ సరఫరాతో పరిగి, చిన్నపల్లి గ్రామాల్లో తరచూ రాత్రి సమయంలో విద్యుత్ కోతలు ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో సమయం సందర్భం లేకుండా విద్యుత్ ఆగిపోవడంతో దొంగల బెడదతో బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ విషయంపై ఏఈ సంజీవప్పను వివరణ కోరగా విట్టాపల్లి గ్రామ సమీపంలోని ఆయిల్ ఫ్యాక్టరీకి విద్యుత్ అందించే విషయంలో అంతరాయం కలుగుతోందన్నారు. ఈ విషయమై లైన్‌మెన్‌ను సంప్రదించండి మమ్మల్ని ఎందుకు విసిగిస్తారంటూ వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆవుపై గుర్తు తెలియని జంతువు దాడి

చిలమత్తూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):అడవిలోకి మేత కోసం వెళ్లిన పాడి ఆవుపై గుర్తు తెలియని జంతువు దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైంది. అయితే ఆవుపై దాడి చేసింది చిరుత అని ఆవు యజమాని అనుమానిస్తున్నాడు. మండలంలోని ఆదెప్పల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణప్ప బుధవారం ఉదయం తన పాడి ఆవుని దగ్గర్లోని అటవీ ప్రాంతంలోకి తోలి వచ్చాడు. ఆవు మేత మేస్తుండగా గుర్తు తెలియని జంతువు ఏదో దాడి చేసింది. గాయపడిన ఆవు రక్త గాయాలతో ఇంటికి వచ్చింది. ఆవు గొంతు, వెనుక తుంటి ఎముకల భాగాల్లో గాయాలయ్యాయి. దీంతో చిరుత దాడి చేసిందని ఆవు యజమాని అనుమానిస్తున్నాడు. అయితే చిరుత దాడి చేసిన విషయాన్ని అటవీశాఖ అధికారులతో చెప్పగా, ఈ ప్రాంతంలో చిరుతలు లేవన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుపడిన కర్ణాటక మద్యాన్ని చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

గోరంట్ల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : కర్ణాటక సరిహద్దులోని పెరమాళ్లపల్లి వద్ద మద్యం తరలిస్తున్న శివకుమార్‌ను మంగళవారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. పుట్టపర్తి ఎక్సైజ్ సీఐ హరిక్రిష్ణ ఆధ్వర్యంలో పెనుకొండ ఎస్ఐ రాముడు, సిబ్బందితో దాడి చేసి అతని వద్దనుంచి 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు 192, 180ఎంఎల్ మద్యం బాటిల్స్ 48 తోపాటు ద్విచక్రవాహనాన్నిస్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

తహసీల్దార్ కార్యాలయ తనిఖీ



కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జేసీ అభిషేక్ కుమార్

సోమందేపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయాన్ని జేసీ అభిషేక్ కుమార్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఫ్రీహోల్డ్ వెరిఫికేషన్‌పై ఆరాతీశారు. అదేవిధంగా భూమికి సంబంధించిన వివాదాలు, రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.